సమావేశము - II
వాల్యూము - III
నెం. 1

వెల : రూ. 4-00
5 నవంబర్, 2014
బుధవారము,
(శక సం. 1936,
కార్తీకం - 14)

# తెలంగాణ శాసన పరిషత్ కార్యకలాపాలు

## అధికార నివేదిక

### విషయ సూచిక

1. 2014-2015 సంవత్సరానికి వార్షిక ఆదాయ - వ్యయ పట్టిక (బడ్జెట్) (అనుబంధం - 1) .. 1

# తెలంగాణ శాసన పరిషత్

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| ఛైర్మన్ | : | శ్రీ కె. స్వామిగౌడ్ |
| డిప్యూటీ ఛైర్మన్ | : | శ్రీ నేతి విద్యాసాగర్ |
| కార్యదర్శి | : | డా. ఎస్. రాజ సదారామ్ |
| ఉప కార్యదర్శులు | : | డా. వి. నరసింహాచార్యులు<br>శ్రీమతి టి. సుశీల |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ టి.బి. జయచందర్<br>శ్రీ ఎస్. దుర్గాప్రసాద్<br>శ్రీ సి.హెచ్. ఉపేందర్ రెడ్డి<br>శ్రీమతి ఎ. చంద్రభాగ<br>శ్రీమతి వి.ఎస్. ప్రసన్నకుమారి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీమతి యస్. నాగమణి |

# తెలంగాణ శాసన పరిషత్తు

## అధికార నివేదిక

## [రెండవ సమావేశము - మొదటి రోజు]

**బుధవారము, నవంబరు 5, 2014**

[సభ ఉ.గం. 11.00 లకు ప్రారంభమైనది గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు.
జాతీయ గీతాలాపనతో సభా కార్యక్రమం మొదలైంది.]

### 2014-2015 సంవత్సరానికి వార్షిక ఆదాయ- వ్యయ పట్టిక (బడ్జెట్)

మిస్టర్ ఛైర్మన్ : గౌరవ సభ్యులందరికి స్వాగతం. ఉప ముఖ్యమంత్రి డా.టి. రాజయ్య 2014-15 సంవత్సరానికి గాను వార్షిక ఆదాయ పట్టిక/ బడ్జెట్‌ను సమర్పిస్తారు.

డా.టి. రాజయ్య: (స్టేషన ఘన్‌పూర్) గౌరవనీయ అధ్యక్షా,...

(బడ్జెట్ ప్రసంగ పాఠాన్ని సభలో చదువసాగారు)

(అనుబంధం - 1)

**2014, నవంబరు 5వ తేదీన తెలంగాణ రాష్ట్ర శాసనసభకు 2014-15 సంవత్సరం బడ్జెట్‌ను సమర్పిస్తూ గౌరవనీయులైన ఆర్థిక మంత్రి శ్రీ ఈటల రాజేందర్ గారు చేయు ప్రసంగం**

*గౌరవనీయ అధ్యక్షా.*

నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ఆర్థిక మంత్రిగా తొలి వార్షిక బడ్జెట్ ప్రవేశ పెడుతున్నందుకు నేనెంతగానో గర్విస్తున్నాను. ఇదొక చరిత్రాత్మక ఘట్టం. ఇటువంటి ప్రతిష్ఠాత్మక అవకాశం లభించినందుకు ఆనందంగా ఉన్నది. ఇంత గొప్ప అవకాశం కలిగించిన తెలంగాణ ప్రజలకు, గౌరవ ముఖ్యమంత్రి గారికి, గౌరవ శాసన సభ్యులకు నేను హృదయ పూర్వకమైన ధన్యవాదాలు తెలుపుతున్నాను.

2. తెలంగాణ సమాజం స్వరాష్ట్రం కోసం, స్వాభిమానం కోసం ఆరు దశాబ్దాలు అలుపెరుగని పోరాటం చేసింది. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర రావు గారు అందించిన సమర్థవంతమైన నాయకత్వంలో ఈ పోరాటం దరి చేరింది. గమ్యాన్ని ముద్దాడింది. అమరుల త్యాగాలు ఫలించినయి. ప్రజల ఆశయం జయించింది. 2014 జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది.

3. సుదీర్ఘ కాలంగా దారుణమైన వివక్షకు తెలంగాణ సమాజం గురైంది. ఆకాంక్షలు అణగారిపోయినయి. పోరాట సందర్భంలో ప్రజలు వ్యక్తం చేసిన డిమాండ్లు అరణ్య రోదనగానే మిగిలిపోయినయి. ఇవాళ ఆ ఆకాంక్షలను నెరవేర్చడమే మా లక్ష్యం. తెలంగాణ ప్రాంత అస్తిత్వాన్ని పరిరక్షించే విధంగా తెలంగాణ ప్రజలకు ఉజ్వల భవిష్యత్తును అందించే విధంగా పూర్తి తెలంగాణ దృక్పథంతో బడ్జెట్‌ను రూపొందించాం. ప్రజా ధనాన్ని న్యాయబద్ధంగా వినియోగించాలనే స్పృహతో పూర్తి అంతఃకరణ శుద్ధితో నిజాయితీగా బడ్జెట్‌కు రూపకల్పన చేసినం.

4. మా ముందు ఇప్పుడు చాలా సవాళ్ళున్నాయి. విచ్ఛిన్నమైపోయిన, విధ్వంసమైపోయిన సమాజాన్ని తిరిగి నిలబెట్టుకోవడం ఆషామాషి విషయం కాదు. ఇది చాలా గంభీరమైన లక్ష్యం.

5. అన్ని రంగాలలో తెలంగాణ క్రుంగి కృశించిపోయింది. పూర్తిగా చీకటి అలుముకున్న సమయంలో స్వరాష్ట్రం ఏర్పడడంతో ఇప్పుడిప్పుడే వెలుగు రేఖలు ప్రసరిస్తున్నాయి. తెలంగాణ ప్రజలు సొంత రాష్ట్రాన్ని సాధించుకోవడమే కాకుండా వలసవాదుల నీడలు, పీడలు లేని అచ్చమైన తెలంగాణ ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పరచుకున్నారు. స్వీయ పాలన చవి చూస్తున్నారు.

6. ప్రత్యక్షంగా వలసవాద పీడన అంతమైనప్పటికీ, యాభై ఏండ్ల చరిత్ర మిగిల్చిన పరోక్ష పెత్తనం ఏదో రూపంలో తెలంగాణను

వేధిస్తూనే ఉన్నది. తెలంగాణ ప్రజలు తమను తాము పరిపాలించుకుంటూ ఉంటే భరించలేని శక్తులు అభివృద్ధికి అనే అవరోధాలు కల్పిస్తున్నాయి.

7. మాకు సంకల్పం ఉన్నది. ప్రజల దీవెనలు సంపూర్ణంగా ఉన్నాయి. ఈ ధైర్యంతో మేం ముందడుగు వేస్తున్నాం. దుష్టశక్తుల ఆటలు కట్టించే నేర్పు, ఓర్పు మాకు ఉన్నాయి. ఏ గుండె ధైర్యంతో ఉద్యమాన్ని సాగించి విజయం సాధించామో అదే స్ఫూర్తితో ఇప్పుడు బంగారు తెలంగాణ సాధించడానికి నడుంబిగించం.

8. తెలంగాణ ఏయే రంగాలలో ధ్వంసం చేయబడిందో ఆ రంగాలన్నింటినీ మళ్ళా చక్కదిద్ది సమాజాన్ని ప్రగతి పథంలో నడిపించడానికి ఈ బడ్జెట్‌ను రూపొందిచాము. అయితే వలసవాద విలయం సృష్టించిన సమస్యలను పరిష్కరించడానికి సులభోపాయాలు పనికిరావు. నిజమైన అభివృద్ధి సాధించడానికి అడ్డదారులు దగ్గరి దారులు ఉండవు. దీర్ఘకాలిక ప్రణాళికతో శాశ్వత పరిష్కారాల దిశగా అడుగులు వేయాలి. అందుకు చాలా పరిణతి అవసరం. గత ప్రభుత్వాలు అనుసరించిన తప్పుడు విధానాలకు విరుగుడుగా తెలంగాణకు అనుగుణమైన సరి అయిన విధానాలను నిర్వచిస్తూ ప్రజల సాంఘిక, ఆర్థిక వికాసానికి దారులు వేస్తున్నాం. విచ్ఛిన్నమైన తెలంగాణ తిరిగి తన కాళ్ళ మీద తాను నిలబడడానికి అవసరమైన శాశ్వత ప్రాతిపదికలను నిర్మిస్తున్నాం.

9. ఇది కేవలం పదినెలల బడ్జెట్ ప్రభుత్వం తనకున్న తక్కువ వ్యవధిలో అత్యవసరంగా నెరవేర్చవలసిన ప్రజల ఆకాంక్షల మీద మొదట దృష్టిసారించింది. తెలంగాణ ఆవిర్భవించిన నాటి నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు మార్చి 31, 2015 వరకు గల కాలాన్ని ఉద్దేశించి బడ్జెట్ ప్రతిపాదనలు చేశాము.

10. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అసువులు బాసిన అమరులు చిరస్మరణీయులు. వారి అత్యున్నత త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. వారి త్యాగం అమూల్యమైంది. ఏమి చేసినా తీరని రుణం వారిది. వారు సాధించిన తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చదిద్దడమే వారికి మనమిచ్చే నిజమైన నివాళి. వారు ప్రజల గుండెల్లో సదా నిలిచి ఉంటారు. వారి పట్ల కృతజ్ఞతగా వారి కుటుంబాలకు పది లక్షల రూపాయల వంతున ఆర్థిక సహాయాన్ని అందిస్తామని మా పార్టీ మానిఫెస్టోలో ప్రకటించాము. ఇప్పుడు ఆ హామిని నిలబెట్టుకుంటూ 459 మంది అమరుల కుటుంబాలకు ఆర్థిక సహాయం చేస్తున్నాం. ఇందుకోసం ఈ బడ్జెట్‌లో వంద కోట్ల రూపాయలను కేటాయించాం.

***మన ఊరు, మన ప్రణాళిక :***

11. గత బడ్జెట్‌లతో పోలిస్తే ఈ బడ్జెట్ విధానపరంగా చాలా భిన్నమైనది. తెలంగాణకు ఇప్పుడు కావలసింది ప్రజల ప్రాధాన్యాలను ప్రతిబింబించే బడ్జెట్, ప్రజలు ఏమి కోరుకుంటున్నారో నిర్ణయించవలసింది హైదరాబాద్‌లో కూర్చుండీ కాదు. గత ప్రభుత్వాల విధానం, పైనుంచి కిందికి అనే పద్ధతిని అనుసరించి జరిగింది. కానీ బడ్జెట్ తయారీ విధానాన్ని మా ప్రభుత్వం పూర్తిగా ప్రజాస్వామికరించింది. ఇందు కోసం కింది నుంచి పైకి అనే సూత్రం అనుసరించింది. ఇందుకోసం వినూత్నంగా మన ఊరు-మన ప్రణాళిక అనే కార్యక్రమం చేపట్టింది. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజల నుంచి ప్రతిపాదనలను సేకరించింది. అందుకోసం ప్రభుత్వం స్వయంగా ప్రజల దగ్గిరికి పోయింది. ప్రజల సూచనల ఆధారంగా సమస్యల పరిష్కారానికి స్వల్ప కాలిక, దీర్ఘకాలిక కార్యచరణ ప్రణాళికను రూపొందించింది.

12. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్‌రావుగారి మార్గదర్శకత్వంలో ఈపథకాలు రూపొందాయి. ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి పైస వృధా కాకూడదని, పక్కదారి పట్టకూడదని, బలహీన వర్గాల అభివృద్ధికి ఉపయోగపడాలనేదే మా లక్ష్యం. అందుకనే ప్రభుత్వం ఆగస్టు 19, 2014న సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహించింది. ప్రజల సంపూర్ణ సహకారంతో, భాగస్వామ్యంతో ఒకే రోజులో ఈసర్వే పూర్తి చేయగలిగాము. ప్రజా సంక్షేమ పథకాలు అనుకున్న లక్ష్యం చేరడానికి ఈ సర్వే ఫలితాలు ఎంతగానో ఉపయోగపడతాయి. అదే సమయంలో పథకాల అమలులో జరిగే అవకతవకలకు అడ్డుకట్ట వేయగలుగుతాము.

***సామాజిక ఆర్థిక పరిస్థితి :***

13. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, ప్రతిపాదించిన నిధులు కేటాయింపులు వివరించబోయే ముందు తెలంగాణ సమాజిక-ఆర్థిక పరిస్థితిని గమనిద్దాం. తెలంగాణ రాష్ట్ర జనాభాలో ఎక్కువ శాతం బలహీనవర్గాల ప్రజలే ఉన్నారు. వారిని అభివృద్ధి చెందిన వర్గాలతో సరిసమానంగా అభివృద్ధి చేయటం మాబాధ్యతగా భావిస్తున్నాం. స్వాతంత్ర్యం వచ్చి ఆరు దశాబ్దాలు దాటిన తరువాత కూడా వారి వెనుకబాటుతనం కొనసాగుతున్నది. దీనికి కారణం చిత్తశుద్ధి లేని ప్రభుత్వాలు, ఆ ప్రభుత్వాల అస్తవ్యస్త విధానలు రాష్ట్ర ఆర్థిక స్థితి, వృద్ధిరేటు 2005-10లో సగటున 10.5 శాతం నమోదుకాగా, 2012-13 నాటికి అది 4.5 శాతానికి దారుణంగా పడిపోయింది. దీనికి కారణం పారిశ్రామిక రంగంలో కనిపించిన

ప్రతికూల వృద్ధిరేటు అనవచ్చు అందరికీ ఉపాధి, అందరికీ అభివృద్ధి కలిగిన బంగారు తెలంగాణ నిర్మాణం కావాలంటే తిరోగమన స్థితిలో ఉన్న రాష్ట్ర ఆర్థికగతిని తక్షణమే పురోగమన దిశలోకి మార్చవలసి ఉన్నది. దీనికోసం వ్యవసాయం, పారిశ్రామిక మరియు మౌలిక వసతుల రంగాలలో భారీ పెట్టుబడుల ఆవశ్యకత వుంది.

14. రాష్ట్ర జి. ఎస్.డి.పి.లో ఎక్కువ శాతం సేవా, పారిశ్రామిక రంగాల నుండి వస్తున్నది. జి. ఎస్. డి.పి.లో సేవా రంగం వాటా 58 శాతం, పారిశ్రామిక రంగం వాటా 28 శాతం. ఉమ్మడి రాష్ట్రంలో పారిశ్రామిక రంగంలో అనుకున్న స్థాయిలో అభివృద్ధి జరగలేదు. అందువల్ల ఇప్పుడు అది తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి తీవ్ర అవరోధంగా మారింది. జి. ఎస్. డి.పి.లో 14 శాతం వాటా కలిగిన వ్యవసాయ రంగమే రాష్ట్రంలోని దాదాపు సగం మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా అండగా నిలుస్తున్నది. అంటే నేటికీ రైతులే అందరికి అన్నం పెడుతున్నారు.

15. తలసరి ఆదాయం విషయంలో అంకెల చూస్తే తెలంగాణ రాష్ట్రం ఆర్థిక పరిస్థితి బాగున్నట్టే కనిపిస్తుంది. 2013-14లో జాతీయ తలసరి ఆదాయం 74వేల 920 రూపాయలు కాగా, తెలంగాణలో 93 వేల 151 రూపాయలు ఇది వాస్తవ విరుద్ధం అని అనడానికి జిల్లాలవారిగా తలసరి ఆదాయంలో అగుపించే తీవ్ర వ్యత్యాసాలే నిదర్శనం. మూడు జిల్లాల్లో మాత్రం తలసరి ఆదాయం జాతీయ సగటుకంటే ఎక్కువ వుంది. ఏడు జిల్లాల్లో జాతీయ సగటు కంటే తక్కువ ఉన్నది. ఇది మేము చెబుతున్న విషయం కాదు అధ్యక్షా, స్వయంగా భారత ప్రభుత్వం నియమించిన అనేక కమిటీలు తెలంగాణ రాష్ట్రంలో ఎక్కువ జిల్లాలు వెనుకబడి ఉన్నాయని చెప్పాయి. బ్యాక్‌వర్డ్ రీజియన్స్ గ్రాంట్ ఫండ్ (బి.ఆర్.సి.ఎఫ్) క్రింద తెలంగాణలోని 9 జిల్లాలను చేర్చారంటే, ఇక్కడి పేదరికాన్ని అర్థం చేసుకోవచ్చు, తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక, సామాజిక అసమానతలు, వెనకబాటుతనం ఇప్పుడు మాముందున్న సవాళ్ళు, ఈ పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికోసం నిజాయితీగా మేము అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాము. సమాజంలోని అన్నివర్గాల పురోభివృద్ధికి పాటుపడటమే మా లక్ష్యం. అయితే అభివృద్ధి కేవలం గణాంకాలలో, ప్రభుత్వ లెక్కల్లో మాత్రమే కనిపిస్తే సరిపోదు. సమాజంలో అణగారిన వర్గాలు, బడుగు బలహీన వర్గాలు జీవితాలలో కనిపించాలి. వారిని విస్మరించి సాధించే అభివృద్ధికి విలువ లేదు. ఈ బడ్జెట్ పత్రాల్లోని ప్రతి కాగితం, ప్రతి అక్షరం ఇదే విషయాన్ని ప్రతిబింబిస్తుంది.

### *ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చటం :*

16. తెలంగాణ ఉద్యమ క్రమంలో ప్రజలు వ్యక్తంచేసిన ఆకాంక్షల పట్ల మాప్రభుత్వానికి స్పష్టమైన అవగాహన ఉంది. ఉద్యమానికి నాయకత్వం వహించిన పార్టీగా మేము వివిధ రంగాలలో తెలంగాణ పట్ల అమలౌతున్న వివక్షను ప్రశ్నించాం. బాధితులతో కలిసి ఉద్యమించాం. ఉద్యమకారుల, మేధావుల భాగస్వామ్యంతో ఎన్నికల మానిఫెస్టోను రూపొందించాం. మానిఫెస్టో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను సమగ్రంగా ప్రతిబింబించింది, ప్రజల ఆమోదం పొందింది. ప్రస్తుతం మానిఫెస్టో వెలుగులోనే ప్రభుత్వ పథకాలను రూపొందించాం. అందుకనుగుణంగా బడ్జెట్ ప్రతిపాదనలను తయారుచేశాం. రాబోయే కాలంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం. అనే విశ్వాసాన్ని ఈ బడ్జెట్‌ద్వారా కలుగజేస్తున్నాం.

### *గొలుసుకట్టు చెరువులు - సాగునీటి పారుదల :*

17. అధ్యక్షా, తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కేంద్రం చెరువు, ప్రాచీన చరిత్రలో తెలంగాణను చెరువుల దేశంగా పేర్కొన్నారు. ఇక్కడి వ్యవసాయ అవసరాలను తీర్చింది చెరువులే. పీఠభూమి ప్రాంతమైన తెలంగాణాకు అనుగుణమైన నీటిపారుదల వ్యవస్థ గొలుసుకట్టు చెరువుల వ్యవస్థ. ప్రపంచానికి క్రీ॥ శ॥ 12-13 శతాబ్దంలోనే వాటర్ షెడ్ వ్యవస్థని పరిచయం చేసిన ఘనత తెలంగాణది. కాకతీయుల కాలంలో ఈ వ్యవస్థ రూపుదిద్దుకున్నది. తరువాతి రాజవంశాలు ఈ వ్యవస్థని పరిరక్షించాయి. కానీ మైనర్ ఇరిగేషన్ పేరుపెట్టి నిధులు లేని పంచాయతీలకు చెరువులను అప్పగించి ఉమ్మడి రాష్ట్రంలో ఈ వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేశారు. భూగర్భ జలాలు అడుగంటడంతో వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయింది. 1960 దశాబ్దం వరకు కూడా మన తెలంగాణలో చెరువుల ద్వారానే దాదాపు 60 శాతం భూములకు సాగునీరు అందేది. కాని సమైక్యాంధ్రలో ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యం, వివక్ష వల్ల మన చెరువులు పనికిరాకుండా పోయాయి. చాలా చెరువులు కబ్జాలకు గురయ్యాయి. చెరువుల్లో పూడికలు కూడా తీయలేదు. ఫలితంగా ప్రస్తుతం చెరువుల ద్వారా సాగయ్యే వ్యవసాయ భూములు 9 శాతం లోపే ఉన్నాయి. భూగర్భ జాలాలను వినియోగించుకోవడానికి రైతులు లక్షలాది రూపాయలు అప్పులు తెచ్చి బోర్లు తవ్వుకున్నారు. మోటార్లు పెట్టుకున్నారు. తెలంగాణలో 80 శాతం వ్యవసాయం ఇప్పుడు ఈ బోర్లు, బావులు ద్వారానే సాగుతున్నది. తెలంగాణ వ్యవసాయానికి జీవన రేఖ అయిన గొలుసుకట్టు చెరువుల వ్యవస్థను పునరుద్ధరించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. అందుకే

తెలంగాణ రాష్ట్రంలోని 45 వేలకు పైగా చెరువులను వచ్చే ఐదేళ్లలో పునరుద్ధరించాలని నిర్ణయించాము. ప్రతి ఏడాది 9 వేల చెరువులను బాగుచేసుకుంటూ ఐదేళ్లలో అన్ని చెరువుల్లో జల కళ ఉట్టిపడేలా చేయాలన్నదే మా లక్ష్యం. కృష్ణా, గోదావరి బేసిన్‌లో 265 టి. ఎం.సి.ల నీటిని నిలువచేసుకునే సామర్థ్యం ఒకప్పుడు మన చెరువులకకు ఉండేది. ఇప్పుడది లేదు. తిరిగి ఆ సామర్థ్యాన్ని పొందాలి. అందుకు అనుగుణంగా ఈ బడ్జెట్‌లో కేటాయింపులు ప్రతిపాదిస్తున్నం. ఈ ఏడాది 9వేల చెరువులను పునరుద్ధరించాడానికి రెండు వేల కోట్ల రూపాయలను ఈ బడ్జెట్‌లో ప్రతిపాదిస్తున్నాము.

18. అదే విధంగా నిర్మాణంలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులను ప్రాధాన్యతాక్రమంగా పూర్తి చేయడం జరుగుతుంది. ముఖ్యంగా కరువు పీడిత మహబూబ్‌నగర్ జిల్లాలోని నాలుగు ఎత్తిపోతల ప్రాజెక్టులను కల్వకుర్తి, కోయిల్ సాగర్, నెట్టెంపాడు మరియు భీమాలను ఆగమేఘాలమీద ఈ సంవత్సరమే పూర్తి చేసి, 2,97,550 ఎకరాలకు అదనంగా సాగునీరు ఇవ్వడం జరుగుతుంది. మొత్తము నీటిపారుదల రంగానికి రూ. 6500 కోట్లు ప్రతిపాదించడమైనది.

### *వాటర్ గ్రిడ్ మరియు త్రాగునీటి వ్యవస్థ :*

19. మనిషికి జీవశక్తినిచ్చేది నీళ్లే, తెలంగాణాలో జీవ నదులు ప్రవహిస్తున్నా గుక్కెడు నీళ్లకోసం రాష్ట్ర ప్రజలు అల్లల్లాడిపోతున్న పరిస్థితి. కేవలం శుభ్రమైన మంచినీరు లేకపోవటం వలన ప్రజలు రోగాలు, మరణాలు బారిన పడుతున్నారన్నది కఠోర వాస్తవం. ఇవ్వాళ ప్రతి జిల్లాలో తాగునీటికి కటకటలాడుతున్న పరిస్థితులున్నాయి. అధ్యక్షా, స్వాతంత్ర్యం వచ్చి ఆరు దశాబ్దాలు గడిచిన తరువాత తాగేనీళ్లకోసం ఆడవాళ్ళు మైళ్ళ దూరాలు నడిచివెళ్లడం మనం సాధించిన ప్రగతి, ఉమ్మడి రాష్ట్రం తెలంగాణ ప్రజలకిచ్చిన వరాలధ్యక్షా, రక్షిత మంచినీటికి నోచుకోక ఆదిలాబాద్ జిల్లా గొండులు రోగాలు, మరణాల పాలుకావడం, సమైక్యాంధ్ర రాష్ట్రంలో నల్గొండ జిల్లా ప్రజల జీవితం శాపగ్రస్త జీవితమైపోయింది. జిల్లాలో కృష్ణానది పారుతున్నది. అయినా గుక్కెడు నీళ్ళు ఏ ప్రభుత్వాలు ఇవ్వలేదు. ఇవాళ నల్గొండ జిల్లా ప్రజలు బొక్కలలో మూలుగు చచ్చిపోయి, కాల్రెక్కలు వంకరపోయి నరకబాధ అనుభవిస్తున్నారు. నల్గొండ జిల్లా ప్రజల దు:ఖం గౌరవ ముఖ్యమంత్రిగారు ఆనాడు ఉద్యమ నేతా వివరిస్తుంటే ప్రతి తెలంగాణ బిడ్డా కన్నీటితో కరిగిపోయాడు అధ్యక్షా, ఫ్లోరోసిస్ మహమ్మారి బారినుంచి నల్గొండ జిల్లా ప్రజల్ని రక్షించాలని ఆరోజే ప్రతిజ్ఞ చేశాం. చాలా ప్రాంతాల్లో నీటిలో ఫ్లోరైడ్ శాతం పెరిగింది. ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్తులు కూడా పెరుగుతున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న మంచినీటి పథకాలు ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగుపడటం లేదు. నమ్మకంగా ఏడాదంతా నీరిచ్చే పరిస్థితి కూడా లేదు. ప్రజల మంచినీటికి భరోసా లేకపోవడం బాధాకరం. ప్రజల కనీస అవసమైన మంచినీటిని అందించడానికి ఇంకా మీన మేషాలు లెక్కించాల్సిన అవసరం లేదని ప్రభుత్వం భావించింది. అందుకే తెలంగాణ రాష్ట్రంలో డ్రింకింగ్ వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నది. సాగునీటి ప్రాజెక్టులన్నిటిలో 10 శాతం నీటిని తాగు నీటి అవసరాల కోసం కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ నీటి ద్వారా ఆయి జిల్లాల్లో వాటర్ గ్రిడ్‌లు ఏర్పాటవుతాయి. జిల్లా అంతటికి సురక్షితమైన ఉపరితల జలాలను అందిస్తాయి. రాష్ట్ర వ్యాప్తంగా గ్రిడ్‌ల ఏర్పాటుకోసం దాదాపు 25 వేల కోట్ల రూపాయలు అవసరమువుతాయని అంచనా, ఈ పథకం పూర్తయ్యేసరికి ప్రతి ఇంటికి నల్లాల ద్వారా మంచినీరు అందుతుంది. ఇక ఏ ఆడబిడ్డ బిందె పట్టుకోని వీధుల వెంట తిరిగే పరిస్థితి రాకుడదని మా ప్రభుత్వ సంకల్పం. ఇందులో భాగంగా ఈ ఏడాది గ్రిడ్ పనులకోసం వేల కోట్ల రూపాయలు ప్రతిపాదించినం.

### *వ్యవసాయ మరియు అనుబంధరంగాలు :*

20. తెలంగాణ రాష్ట్రంలో అధికశాతం ప్రజలు వ్యవసాయం మీదే ఆదారపడి జీవిస్తున్నారు. కొత్తగా సాగునీటి వ్యవస్థలు కల్పించకపోవటం వల్ల ఉన్న వ్యవస్థలను నాశనం చేయటంవల్ల ఎక్కువ శాతం వ్యవసాయం, భూగర్భ జలాల ఆధారంగానే సాగుతున్నది. వర్షాభావ పరిస్థితులు వరుస కరువులతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. రైతు తన పెట్టుబడిలో ఎక్కువ శాతం నీటికోసమే ఖర్చుపెట్టవలసి వస్తున్నది. ఆర్థిక వనరులు అందుబాటులో లేకపోవడం, పెరిగిపోతున్న పెట్టుబడులు, తక్కువ ఉత్పత్తి తదితర కారణాలవల్ల వ్యవసాయం చాలా సంక్షోభంలో కూరుకుపోయింది. 1990 తరువాత పరిస్థితి మరింత దిగజారింది. వ్యవసాయం ద్వారా వచ్చే ఆదాయం బాగా తగ్గింది. రైతులు రుణాలను తిరిగి చెల్లించడం చాలా కష్టమైపోయింది. వాతావరణ పరిస్థితులు, చీడ పీడలు, పంటలకు వివిధ రకాల రోగాలు సోకడం తదితర కారణాలవల్ల వ్యవసాయం నరక ప్రాయంగా మారింది. చాలా మంది రైతులు ఈ కారణాలవల్ల ఆత్మహత్యలు చేసుకున్నారు. దేశంలో రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా జరిగిన ప్రాంతంగా నిన్నటి ఆంధ్రప్రదేశ్ మనల్ని మిగిల్చింది. అప్పుల ఊబి నుండి రైతులను బయట

పడేయకపోతే పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందని మేము భావించాం. రైతులకు ఉన్న రుణం తీరకుండా మళ్లీ వారికి ఎక్కడా కొత్త రుణం పుట్టదు. మానిఫెస్టోలో కేవలం పంటరుణం లక్ష రూపాయల వరకు మాఫీ చేస్తామని ప్రకటించాం. కానీ రైతుల కడగండ్లకు చలించి గౌరవ ముఖ్యమంత్రిగారు బంగారం గిర్వి పెట్టి తీసుకొన్న పంటరుణాలను కూడా మాఫీ చేస్తూ నిర్ణయం తీసుకొన్నాము. ఇప్పటికేమొదటి విడతగా 4,250 కోట్ల రూపాయలను బ్యాంకుల్లో జమ చేశాము, మిగతా విడతలను వచ్చే మూడేళ్లలో ఇదేవిధంగా చెల్లిస్తాము. బ్యాంకులు, రైతుల రుణాలను రెన్యూవల్ చేయడం కోసం ప్రతి రోజు సమీక్షలు నిర్వహించి రైతుకు మేలు చేయడానికి కృషి చేశాము, నాకు తెలిసి దేశంలో మరే రాష్ట్రంలో కూడా రైతు రుణాలను ఇంత పెద్ద మొత్తంలో మాఫీ చేయలేదు. ఈ ఘనత మా ప్రభుత్వానికి దక్కిందని మీ ద్వారా సభకు తెలియజేస్తున్నాను.

21. 2009-10 సంవత్సరం నుండి వరుసగా ప్రకృతి వైపరీత్యాలు వచ్చి పంటలు దెబ్బతిన్నాయి. రైతులు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని గతంలో ఎన్నోసార్లు వేడుకొన్నారు. వారి తరపున మేము ప్రభుత్వాలతో పోరాడాం. అయినా ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. మేము అధికారంలోకి రాగానే ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించాలని నిర్ణయించాము. ఆ రైతులను ఆదుకోవడానికి 480.43 కోట్ల రూపాయల ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలను చెల్లించాము.

22. గతంలో ఎర్రజొన్న రైతులు తమకు న్యాయంగా రావాల్సిన బకాయిలను చెల్లించమని అడిగితే అప్పుడున్న ప్రభుత్వం వారి మీద బుల్లెట్లు కురిపించింది. రైతుల రక్తం చవిచూసింది. అప్పుడు ఎర్రజొన్న రైతుల పక్షాన మా గౌరవ ముఖ్యమంత్రిగారు, మేము నిలబడ్డాము. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇక రానే రావనుకున్న ఎర్రజొన్న బకాయిలను చెల్లించాం, రైతుల కన్నీరు తుడిచాం. ఎర్రజొన్న రైతులకు ఈ బడ్జెట్‌లో 11.50 కోట్ల రూపాయల బకాయిలను చెల్లించినం. మా ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని నిరూపించాం.

23. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు మేము గట్టి ప్రయత్నం చేస్తున్నము. వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్లలో సరైన ధర రాకపోవటం రైతులు ఎదుర్కుంటున్న మరో ప్రధాన సమస్య ప్రభుత్వం నుండి సరైన భరోసా లేకపోతే రైతులు వ్యవసాయం చేయలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. అందుకోసమే ప్రభుత్వం మార్కెట్ ఇంటర్‌వెన్షన్ ఫండ్‌ను ఏర్పాటు చేయతలపెట్టింది. ప్రభుత్వం ఇందుకోసం బడ్జెట్‌లో 400 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నది. మార్కెట్‌లో ధరలను స్థిరీకరించడానికి ఈ చర్య ఎంతగానో ఉపయోగపడుతుంది.

*విత్తన భాండాగారంగా తెలంగాణ :*

24. వ్యవసాయంలో రైతులు తాము పండించే పంటకు ఎంత ధర వస్తుందో కూడా తెలియని ఆయోమయంలో వున్నారు. చాలా సార్లు రైతులకు అనుకున్న ధరకూడా రావడంలేదు. పైగా ఒక రకం పంటలు అందరూ పండించడం, నేలను బట్టి పంటను సాగుచేయకపోవడం, మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను పండించకపోవడం తదితర కారణాలు కూడా ఉన్నాయి. ఈ విషయంలో కూడా మా ప్రభుత్వం ప్రత్యేక చొరవను ప్రదర్శిస్తుంది. అదృష్టవశాత్తు తెలంగాణలో అనేక రకాల నేలలు ఉన్నాయి. సారవంతమైన భూములు ఉన్నాయి. ఇవన్నీ కూడా విత్తనాల తయారీకి అనుకూలమైనవి. మంచి ప్రణాళికతో తెలంగాణను భారతదేశ విత్తన భాండాగారంగ మార్చాలని మేము నిర్ణయించాము. ఇందుకోసం ఈ బడ్జెట్‌లో 50 కోట్ల రూపాయలను ప్రతిపాదించినం, మార్కెటింగ్ కోసం విత్తన తయారీ కంపెనీలతో ఒప్పందాలు కూడా కుదుర్చుకునేందుకు ప్రభుత్వం సిద్ధమయింది. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం బహుముఖ వ్యూహంతో పనిచేస్తున్నది. ఒ వైపు రైతు రుణాలను మాఫీ చేయడం, మరో వైపు సీడ్ చెయిన్స్ అభివృద్ధిచేయడం, క్రాప్ కాలనీలను ఏర్పాటుచేయడం, భూసార పరీక్షలు నిర్వహించడం, ఫామ్ మెకనైజేషన్ లాంటివి ఎన్నో కార్యక్రమాలు తీసుకుంటున్నాము. ఫామ్ మెకనైజేషన్ కోసం 100 కోట్ల రూపాయలు, రైతుబడుల కోసం 10 కోట్ల రూపాయలు, క్రాప్ కాలనీలు అభివృద్ధి చేయడంకోసం 20న కోట్ల రూపాయలను ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించినం.

*కమతాల ఏకీకరణ :*

25. రైతులు తమకున్న కొద్దిపాటి భూమి ఒకచోట ఉంటే సాగు సులభతరవౌతుంది. ఒకచోటలేక రైతులు నానా కష్టాలు పడుతున్నారు. అందుకే మ్యానిఫెస్టోలో మేము కమతాల ఏకీకరణను ప్రతిపాదించాం. రైతుకు పెట్టుబడుల వ్యయం తగ్గించేందుకు, సౌకర్యం కలిగి ఉత్పత్తి పెరిగేందుకు కమతాల ఏకీకరణ చేపడుతున్నాం.

*హార్టికల్చర్‌కు ప్రోత్సాహం :*

26. తెలంగాణ పండ్ల తోటలకు, పూలసాగుకు, కూరగాయల సాగుకు మరియు ఉద్యానవనాలు పెంచడానికి చాలా అనుకూలమైనది. గ్రీన్‌హౌజ్ కల్టివేషన్ రైతులకు అందుబాటులోకి

తీసుకు రావాలని ప్రభుత్వం నిశ్చయించింది. హైదరాబాద్ చుట్టుప్రక్కల దాదాపు 1000 ఎకరాల విస్తీర్ణంలో పైలట్ ప్రాజెక్టుగా గ్రీన్‌హౌజ్ కల్టివేషన్ ప్రారంభిస్తాము. అంతర్జాతీయంగా మార్కెటింగ్ అవకాశాలు కలిగిన కూరగాయలను వీటిద్వారా పండించవచ్చు గ్రీన్‌హౌజ్‌ల ఏర్పాటుకోసం 75 శాతం సబ్సిడీగా ఇస్తాము. ఇందుకోసం బడ్జెట్‌లో 250 కోట్ల రూపాయలు ప్రతిపాదించాము.

27. సూక్ష్మ సేద్యానికి కూడా ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుంది. డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటుకు ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం సబ్సిడీ, చిన్న-సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీ, ఇతరులకు 80 శాతం సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించాం. ఇందుకోసం బడ్జెట్‌లో 250 కోట్ల రూపాయలు ప్రతిపాదించాము.

28. వ్యవసాయం తరువాత తెలంగాణాలో కోళ్ల పరిశ్రమ ఎంతో ముఖ్యమైంది. దేశంలో కోళ్ల పరిశ్రమ అధికంగా విస్తరించిన రాష్ట్రం మన తెలంగాణ. కోళ్ల దాణా రేట్లు పెరగడం, గుడ్లు, మాంసం ధరల్లో హెచ్చుతగ్గులు ఈ రంగాన్ని బాగా దెబ్బతీస్తున్నాయి. కాబట్టి పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలని నిర్ణయించుకున్నాము. కోళ్ల పరిశ్రమకు వ్యవసాయ హోదా కల్పిస్తూ, కోళ్ల పరిశ్రమ నిర్వహించే వారిని కూడా రైతులుగానే గుర్తిస్తున్నాము. కాబట్టి వారికి కూడా విద్యుత్ విషయంలో సబ్సిడీలు అందించాలని నిర్ణయం తీసుకున్నాము. 20 కోట్ల రూపాయలను ఇందుకోసం ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించినం. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను కూడా రూపొందిస్తున్నం. 14 రూపాయలకు కిలో ఉన్న మొక్కజొన్నలను కోళ్ళ రైతులకు సబ్సిడీ ధరపై కిలో 10 రూపాయలకే ఇప్పటికే లక్షన్నర టన్నులు అందించాం. గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వమూ ఈ పరిశ్రమను ఈ విధంగా ఆదుకోలేదు.

### *పాడి పరిశ్రమ :*

29. డిమాండ్‌కు తగ్గట్టుగా మన దగ్గర పాల ఉత్పత్తి లేదు. రైతులను ప్రోత్సహించేందుకు, పాల ఉత్పత్తిని పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి 16.30 కోట్ల రూపాయలను ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించాము. మీ అందరికి తెలుసు ఇటీవలే మా ప్రభుత్వం విజయ డైరీకి పాలు సరఫరాచేసే రైతులకు లీటరుకు 4 రూపాయల చొప్పున ప్రోత్సాహక ధర ప్రకటించినము.

30. మత్స్య పరిశ్రమ విషయంలో మత్స్యకారులను ఆదుకోవడానికి ఇప్పటికే ఇద్దరు మంత్రులు బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాలకు వెళ్ళివచ్చారు. ఆ అనుభవంతో ఆధునాతన పద్ధతుల్లో చేపల పెంపకానికి సంబంధించిన ప్రణాళిక రూపొందిస్తున్నాము. దీనికోసం వీలైనంత ఎక్కువ డబ్బు ఖర్చుచేసి మత్స్యకారులను ప్రగతి పథంలో నడిపిస్తాము. చెరువుల పునరుద్ధరణ ద్వారా చేపల పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుంది, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకొంటున్నాం.

### *షెడ్యూల్డు కులాల ప్రజల అభివృద్ధి :*

31. తెలంగాణ రాష్ట్రం ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీలు ఎక్కువగా ఉన్న రాష్ట్రం. రాష్ట్రంలో 15.4 శాతం మంది ఎస్సీలు ఉన్నారు. వారంతా పేదరికం అనుభవిస్తున్నరు. వారి బాధలు తీర్చడానికి ఎంతో చేశామని గత ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకున్నప్పటికి ఒరిగింది శూన్యం. అర్థం లేని కార్యక్రమాలు వారికి ఎలాంటి మేలు చేయలేదు. వారి సమస్యలు ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న మాదిరిగా ఉన్నాయి. వారి జీవనోపాధికి శాశ్వత పరిష్కారం చూపనిదే వారి బతుకుల్లో మార్పురాదు. సాంఘిక సంక్షేమ శాఖను, నిర్దిష్టంగా ఎస్సీ అభివృద్ధి శాఖగా మార్చాము. ఎస్సీలకు మూడెకరాల భూమి పంపిణీ చేయాలని విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్న విషయం మీ అందరికి తెలుసు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఈ కార్యక్రమాన్ని గౌరవ ముఖ్యమంత్రిగారు గోల్కొండ కోటలో ప్రారంభించారు. ప్రతి జిల్లాలో కూడా ఈ కార్యక్రమం ప్రారంభం అయ్యింది. ఇదొక నిరంతర కార్యక్రమం. కాలపరిమితి లేదు. భూమి దొరికిన కొద్ది దళిత రైతులకు అందజేస్తాము. ఈకార్యక్రమం కోసం ఈ బడ్జెట్‌లో 1000 కోట్ల రూపాయలు ప్రతిపాదించినం. 2014 నుండి 2019 వరకు అంటే ఐదేళ్లలో ఎస్సీల అభివృద్ధికోసం 50 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయాలని నిర్ణయించుకున్నాము.

### *ఎస్టీ సంక్షేమం :*

32. రాష్ట్రంలో ఎస్టీల సమగ్రాభివృద్ధికోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు తీసుకుంటున్నది. గిరిజన తండాలు, ఆదివాసి గూడెంలను గ్రామ పంచాయితీలుగా మార్చాలనే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉంది. మైదాన ప్రాంత గిరిజనులకోసం కూడా ఐ.టి.డి.ఎ. తరహా పథకాలు అమలుచేయాలని నిర్ణయించాము. కొమురం భీమ్ అమరత్వం పొందిన జోడే ఘాట్‌ను కొమురం భీమ్ స్మారక ప్రదేశంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. అక్కడొక గిరిజన మ్యూజియంతోపాటు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం కోసం ఇప్పటికే 25 కోట్ల రూపాయలు మంజూరు చేసినం. వరంగల్ జిల్లాలోని సమ్మక్క, సారలమ్మ జాతర జరిగే ప్రాంతాన్ని కూడా ఇదే విధంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నది. గిరిజన ప్రాంతాల్లో విద్యా సంస్థల ఏర్పాటుకోసం కూడా 245.92 కోట్ల రూపాయలను ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించినము. వెరసి మొత్తము 4559.81 కోట్ల

రూపాయలను ఎస్టీల సంక్షేమానికై ప్రతిపాదించడమైనది. తెలంగాణ రాష్ట్రంలో గల గిరిజనుల జనాభా శాతానికి అనుగుణంగా ఎస్టీ ప్లాన్ పరిమాణాన్ని 9.34 శాతానికి పెంచడము జరిగినది.

*ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక :*

33. ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన నిధులు ఖర్చు చేయాల్సి ఉన్నా, ఆ నిధులన్నీ వేరే పథకాలకు మళ్లించిన ఉదాహరణలు కోకొల్లలుగా ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను కట్టుదిట్టంగా అమలుచేసి ఆయా వర్గాల అభివృద్ధికి పాటుపడాలన్నది ప్రభుత్వ ఆశయం. ఎస్సీ, ఎస్టీల పేరుతో వేరే పథకాలకు నిధుల మళ్లించే ప్రశ్నే ఉండదు. గతంలో మాదిరిగా వివిధ శాఖలద్వారా కాకుండా ఎస్సీ అభివృద్ధి శాఖ, ఎస్టీ అభివృద్ధి శాఖ ద్వారానే సబ్‌ప్లాన్ నిధులు ఖర్చుచేస్తాము. జనాభా ప్రాతిపదికన ఎస్సీల సబ్‌ప్లాన్‌కు 7579.45 కోట్ల రూపాయలు, ఎస్టీల సబ్‌ప్లాన్‌కు 4559.81 కోట్ల రూపాయలను ప్రతిపాదించినము.

*బి.సి. సంక్షేమం :*

34. రాష్ట్రంలో 45 శాతం మంది బిసిలు ఉన్నరు. ఇప్పటివరకు బిసిల సంక్షేమం కోసం నిర్దిష్టమైన ప్రణాళిక లేదు. బిసిల అభివృద్ధి కోసం అంటూ కార్పొరేషన్లు ఏర్పాటు చేశారు తప్ప, వాటిద్వారా ఒరగబెట్టింది ఏమీ లేదు. కాని మా ప్రభుత్వం ఓ ప్రణాళిక ప్రకారం, ఒ పద్ధతి ప్రకారం బిసిల అభివృద్ధి కార్యక్రమం చేయాలనుకుంటుంది. బిసి కులాలకు కావలసిన ఆర్థిక సహకారం అందిస్తుంది. విద్యావికాస కార్యక్రమాలను నిర్వహిస్తూనే మిగతా శాఖల్లోని నిధులను కూడా సమాన ప్రాతిపదికన వీరి అభివృద్ధికోసం వెచ్చించడం జరుగుతుంది. ప్రణాళికేతర మరియు ప్రణాళిక వ్యయం కింద 2022 కోట్ల రూపాయలు బి.సి. అభివృద్ధి కోసం ప్రతిపాదించినము.

*మైనారిటీ సంక్షేమం :*

35. రాష్ట్రంలో 11 శాతం మంది మైనార్టీలు ఉన్నారు. ఎక్కువ శాతం మంది మైనార్టీలు సామాజిక, ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. లౌకికదేశంలో వారి జీవన పరిస్థితి అన్ని కోణాల్లో దిగజారిపోతున్నది. గత ప్రభుత్వాలు వారిని ఓటు బ్యాంకుగా చూశారు తప్ప వారి అభివృద్ధి పట్ల ఏ మాత్రం శ్రద్ధ చూపలేదు. ఈసారి బడ్జెట్లో మైనారిటీల సంక్షేమం కోసం 1030 కోట్ల రూపాయల ప్రణాళికా బడ్జెట్‌ను అందిస్తున్నాము. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్‌లో తెలంగాణ మైనారిటీల కోసం కేటాయించింది మొత్తం 10 జిల్లాలకు ఏడాదికి 501.98 కోట్ల రూపాయలయితే, ఇప్పుడు అదీ 10 నెలల కాలానికి అందుకు రెట్టింపు నిధులను ప్రతిపాదించినం, ఇది ఒక చారిత్రక నిర్ణయం.

*కళ్యాణలక్ష్మి :*

36. సమాజంలో సగ భాగం మహిళలే. కాని వారంతా సామాజిక, ఆర్థిక బంధనాల్లో చిక్కుకున్నారు. వారికి ఇంకా సంకెళ్లు తొలగలేదు. కులం ఏదైనా సరే అమ్మాయి అంటేనే ఓ భారంగా చూసే పరిస్థితి ఉంది. ఇక వారి పెళ్లిల్ల ఖర్చులను తలచుకొని తల్లిదండ్రులు ఆడపిల్లలని గుండెలపై కుంపటిగానే భావించే దుస్థితి దాపురించింది. ముఖ్యంగా పేదరికంతో బాధపడుతున్న ఎస్సీ, ఎస్టీ, ముస్లిం కుటుంబాల్లో ఆడబిడ్డల పెళ్లిల్లు మోయలేని భారంగా పరిణమించాయి. అట్టడుగు వర్గాల కోసం అనునిత్యం తపించే గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కె.సి. ఆర్ గారికి మానస పుత్రిక కళ్యాణ లక్ష్మి పథకం. పైన పేర్కొన్న మూడు వర్గాల ఆడపిల్లల పెళ్ళిల్లకు ప్రభుత్వం సహాయం 51 వేల రూపాలయు అందించాలన్నది ఆ పథకం ఉద్దేశ్యం. ఒకరకంగా ఆడపిల్లల పెండ్లికి అయ్యే ఖర్చులో ఆ కుటుంబం భారాన్ని పంచుకోవడమే ఈ పథకం. ఎస్సీ, ఎస్టీల కోసం అమలు చేసే పథకానికి కళ్యాణ లక్ష్మి అని, ముస్లింలకోసం అమలుచేసే కార్యక్రమానికి షాదీ ముబారక్ అని పేర్లను పెట్టాము. కార్యక్రమం క్రింద ఎస్సీలకోసం రూ. 150 కోట్లు, ఎస్టీల కోసం రూ. 80 కోట్లు, ముస్లింల కోసం రూ. 100 కోట్లు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించినము.

*మహిళా, శిశు సంక్షేమము :*

37. మహిళలను గౌరవంగా, మర్యాదగా చూసుకోవాల్సిన సమాజంలో వారికి అందుకు భిన్నమైన అనుభవాలు ఎదురవుతున్నాయి. మహిళల భద్రతకు భరోసా లేకుండా పోయింది. అత్యాచారాలు, అఘాయిత్యాలు, ఈవ్‌టీజింగ్, యాసిడ్ దాడులు లాంటి సంఘటనలు కలవరపరుస్తున్నాయి. మహిళల రక్షణ, భద్రత విషయంలో కఠినంగా ఉండాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నది. మహిళలు, బాలికల రక్షణ విషయంలో సూచనలకోసం ప్రభుత్వ మహిళా అధికారులతో కమిటీకూడా వేశాము. ఈ కమిటీ చాలా సిఫారసులుకూడా చేసింది. వీటన్నింటిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొని అమలుచేస్తుంది. హైదరాబాద్ నగరంలో మహిళల భద్రతకోసం, ఈవ్‌టీజింగ్ అరికట్టడంకోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కూడా ఏర్పాటయ్యింది. మహిళల భద్రత కోసం చేపట్టిన కార్యక్రమాలను అమలు చేయడంకోసం బడ్జెట్‌లో 10 కోట్ల రూపాయలను కేటాయించినము.

38. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, శిశువుల సంక్షేమంకోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గతంలో 7 నెలల నుంచి 3 సంవత్సరాల వయసుగల శిశువులకు నెలకు 8 గుడ్లు మాత్రమే ఇచ్చేవారు. దానిని మా ప్రభుత్వము నెలకు 16 గుడ్లకు పెంచింది. అలాగే 3 నుండి 6 సంవత్సరాల వయస్సుగల బాలబాలికలకు గతంలో నెలకు 16 గుడ్లు ఇస్తే, ప్రస్తుతం దానిని రోజుకొక గుడ్డు చొప్పున నెలకు 30 గుడ్లకు పెంచడమైనది. ఇక మహిళల విషయానికొస్తే గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు నెలకు 25 గుడ్లు మరియు రోజుకు 200 మి.లీ. పాలు, అది కూడా కేవలం 45 శాతం మందికి మాత్రమే ఇచ్చేవారు. ప్రస్తుతం దానిని మేము 100 శాతం గర్భిణీస్త్రీలు, బాలింతలకు నెలకు 30 గుడ్లు మరియు రోజుకు 200 మి.లీ. పాలను ఇవ్వడానికి ప్రతిపాదిస్తున్నం. ఈ చర్యలు స్త్రీ, శిశు సంక్షేమానికి మరింత మెరుగ్గా ఉపయోగపడతాయని విశ్వసిస్తున్నాం. ఇందుకోసం మా ప్రభుత్వం 2014-15 బడ్జెట్‌లో రూ. 221 కోట్లు ప్రతిపాదించడం జరిగింది. ఇది సమైక్యాంధ్రప్రదేశ్‌లో ఓట్ ఆన్ బడ్జెట్‌లో తెలంగాణకు కేటాయించిన దానికంటే 300 శాతం అధికంగా ఉన్నది. ఐ.సి.డి. ఎస్. పథకం క్రింద రూ. 1103.88 కోట్లు కేటాయించడానికి కూడా ప్రతిపాదించినం.

39. గ్రామీణ ప్రాంతాల్లో పేద మహిళలు ఇంకా కట్టెల పొయ్యిల మీద వంట చేస్తున్నారు. దీనివల్ల వారి ఆరోగ్యం బాగా చెడిపోతున్నది. ఈ సమస్యను అధిగమించడానికి పేద మహిళలందరికి ఎల్‌పిజి కనెక్షన్లు అందిస్తాము. దీనికోసం ఈ బడ్జెట్‌లో 100 కోట్ల రూపాయలను ప్రతిపాదించినము.

***ఆసరా :***

40. వృద్ధులు, వితంతువులు, వికలాంగులను ఆదుకోవడానికి, వారికి ఒక గౌరవ ప్రదమైన జీవితం అందించడానికి ప్రభుత్వం ఆసరా పేరుతో పెన్షన్లు అందించనున్నది. ప్రస్తుతం అందిస్తున్న పెన్షన్లు ఏ మాత్రం సరిపోవడం లేదు. కాబట్టి పెన్షన్లను నవంబర్ 8 నుండి పెంచుతున్నాము. వృద్ధులు, వితంతువుల పెన్షన్లను 200 రూపాయల నుంచి 1000 రూపాయలకు, వికలాంగుల పెన్షన్ 500 రూపాయల నుండి 1500 రూపాయలకు పెంచినం. చేనేత, బీడి కార్మికులు, గీత కార్మికుల పెన్షన్లు కూడా పెంచడానికి ప్రదిపాదిస్తున్నాము. వృద్ధులు, వితంతువుల పెన్షన్ల కోసం రూ. 1315.77 కోట్లను, వికలాంగుల పెన్షన్ల కోసం 367.75 కోట్ల రూపాయలను ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించినము.

***విద్య :***

41. విద్యపైన చేసే వ్యయాన్ని ఖర్చుగా చూడకుండా, మానవ వనరుల అభివృద్ధి కోసం భవిష్యత్తు కొరకు పెట్టే పెట్టుబడిగా ఈ ప్రభుత్వము గుర్తిస్తున్నది.

42. మంచి విద్య అందించడం ద్వారానే ప్రజల జీవన ప్రమాణాలను పెంచగలమనే విషయాన్ని ఈ ప్రభుత్వం గట్టిగా నమ్ముతున్నది. చదువుకున్న మరియు ఉద్యోగార్హత గల యువత సమాజ స్థితి గతులను శీఘ్రంగా మార్చగలరనేది మా విశ్వాసం. విద్యా వ్యవస్థను పటిష్టం చేయడం ద్వారానే సమాజంలో మంచి పౌరులను తయారు చేయగలవని స్వర్గీయ ప్రొఫెసర్ జయశంకర్ గారు తరచుగా చేప్పేవారు. వలస పాలనలో వైద్యం మాదిరిగానే విద్యా వ్యవస్థ కూడా పేద ప్రజలకు దూరమైంది. నాణ్యమైన విద్యా పేద పిల్లలకు అందడం లేదు. తెలంగాణలో డ్రాపౌట్ల శాతం జాతీయ సగటు కంటే చాలా ఎక్కువగా వున్నది. ఎస్సీ, ఎస్టీలలో ఎక్కువ మంది డ్రాపౌట్లు వుండటం అత్యంత ఆందోళన కలిగించే విషయం. తెలంగాణ ప్రభుత్వం విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయడానికి కంకణం కట్టుకున్నది. కేజి టు పీజి ఉచిత విద్యాను దశల వారీగా అమలు చేస్తుంది. ఇందుకోసం 25 కోట్ల రూపాయల టోకెన్ అమౌంట్‌ను ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించినం. కేంద్రప్రభుత్వం సహకారంతో మండల స్థాయిలో మోడల్ స్కూళ్లను (ఆదర్శ పాఠశాలలను) ఏర్పాటు చేయడానికి 940.73 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాం. రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ కోసం 906.40 కోట్ల రూపాయలను ప్రతిపాదించినాము. సాంకేతిక విద్యా వ్యవస్థను మెరుగుపరచడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాము. సాంకేతిక విద్యను అభ్యసించిన వారు ఉద్యోగంలో స్థిరపడే విధంగా కార్యాచరణ ఉండాలనేది మా ప్రభుత్వ ఆలోచన. సాంకేతిక విద్యా వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు 212.86 కోట్ల రూపాయలను ప్రతిపాదించినాము. గతంలో నిర్లక్ష్యానికి గురైన బాసర ట్రిపుల్ ఐటికి 119.63 కోట్లు ప్రతిపాదించినాము. విద్యాశాఖలోని అన్నివిభాగాలకు కలిపి 109.56 కోట్ల రూపాయలు ప్రతిపాదించినాము.

***వైద్యం, ఆరోగ్యం:***

43. ప్రజలకు మెరుగైన వైద్యం అందంచడం తన ప్రధాన కర్తవ్యంగా ఈ ప్రభుత్వం భావిస్తున్నది. సమైక్య ఆంధ్రప్రదేశ్ ఏర్పడక ముందు హైదరాబాద్ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అప్పటి

ప్రభుత్వం ఉచితంగానే వైద్యం అందించేది. కాని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రులను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంవల్ల ప్రైవేటు రంగంలో ఆసుపత్రులు పెద్ద ఎత్తున వచ్చాయి. వైద్యం ఖరీదు అయిపోయింది. సామాన్యులకు వైద్యం అందుబాటులో లేని పరిస్థితి వచ్చింది. ఏండ్ల తరబడి జరిగిన ఈ పొరపాటును, నిర్లక్ష్యాన్ని రాత్రికి రాత్రి సరిచేయడం సాధ్యం కూడా కాదు. అయినప్పటికి ప్రజారోగ్యాన్ని కాపాడటం కోసం, ప్రభుత్వ ఆసుపత్రులను బాగుచేసి పేదలకు వైద్యాన్ని అందుబాటులోకి తేవడం కోసం ప్రభుత్వం అంకిత భావంతో పనిచేస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడానికి తీసుకునే చర్యల్లో భాగంగా ఈసారి బడ్జెట్‌లో 2282.86 కోట్ల రూపాయలను ప్రతిపాదించినాము. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఈ కేటాయింపులు 1277.39 కోట్లు అనే విషయాన్ని సభ్యులు గమనించాలని కోరుతున్నాను. ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవడంలో భాగంగా హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులకు చెరో వంద కోట్ల రూపాయల చొప్పున ప్రతిపాదించినాము. సుల్తాన్‌బజార్ మరియె పెట్లబురుజు మెటర్నిటి ఆసుపత్రుల అభివృద్ధికి 50 కోట్ల రూపాయలు, నీలోఫర్ ఆసుపత్రికి 30 కోట్ల రూపాయలు, కింగ్‌కోటి ఆసుపత్రికి 25 కోట్ల రూపాయల చొప్పున ప్రతిపాదించినాము. జిల్లా కేంద్రాలలోని అన్ని ఆసుపత్రులను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులుగా మార్చడానికి చర్యలు తీసుకొంటున్నాము. రాష్ట్రంలో 42 ఏరియా ఆసుపత్రులను అప్‌గ్రేడ్ చేయడానికి ఒక్కో ఆసుపత్రికి కోటి రూపాయలు ఖర్చు పతిపాదించినాము. కంటి, మానసిక, ఛాతి, ఇఎన్‌టి ఆసుపత్రులను అభివృద్ధి చేయడానికి 40 కోట్ల రూపాయలను ప్రతిపాదించినాము. మెడికల్ కళాశాలల భవనాల నిర్మాణం కోసం 152 కోట్ల రూపాయలను ప్రతిపాదించినాము. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సభ్యులు అభినందిస్తారని ఆశిస్తున్నాను. వరంగల్‌లో హెల్త్‌యూనివర్సిటీ స్థాపిస్తున్నామని గర్వంగా ప్రకటిస్తున్నాను. తెలంగాణ రాష్ట్రంలో వైద్య సేవలు అభివృద్ధి చెందడానికి ఈ యూనివర్సిటీ ప్రతిపాదనలు తయారు చేస్తుందని చెప్పడానికి సంతోషిస్తున్నాను.

***పరిశ్రమలు:***

44. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచడానికి పారిశ్రామికీకరణే మార్గం. కాని తెలంగాణలో పారిశ్రామికభివృద్ధి రేటు 2012-13లో మైనస్ 0.9 శాతంకు పడిపోయింది. 2013-14లో కొద్దిగా పెరిగి 2.7 శాతానికి చేరింది. అయినప్పటికి ఇంకా చాలా ప్రగతి సాధించాల్సి ఉంది. అందుకే తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానం అవలంభిస్తుంది. దేశంలోనే మరే రాష్ట్రంలో కూడా తీసుకురానంత ఆకర్షణీయమైన మరియు ప్రభావంతమైన ఇన్‌వెస్టర్ ఫ్రెండ్లీ పారిశ్రామిక విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం తీసుకువస్తున్నది. పారిశ్రామిక అనుమతులు ఇచ్చేందుకు గౌరవ ముఖ్యమంత్రి కార్యాలయంలోనే చేజింగ సెల్ ఏర్పాటువుతుంది. సింగిల్ విండో విధానం ద్వారా త్వరితగతిన అనుమతులు ఇచ్చే ఏర్పాటు చేస్తున్నాము. పెట్టుబడి దారులు ప్రతి కార్యాలయం చుట్టూ తిరగకుండా చేజింగ్ సెల్ అన్ని రకాల అనుమతులను తీసుకుని ఇచ్చేలా ఏర్పాటు చేస్తున్నాము. తెలంగాణ స్టేట్ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు బలోపేతం చేస్తాము. దాదాపు 5 లక్షల ఎకరాల భూమిని ఆ సంస్థకు అప్పిగిస్తాము. అన్ని రకాలుగా అభివృద్ధి చేసి ప్లగ్ అండ్ ప్లే విధానంలో పరిశ్రమల కోసం ఆ భూమిని కేటాయిస్తాము. సదరు భూమికి నీళ్లు, కరెంటు సరఫరాలాంటి పనులు కూడా టి.ఎస్.ఐ.ఐ.సి. చేసిపెడుతుంది. దీనికోసం టి.ఎస్.ఐ.ఐ.సి.కి 100 కోట్ల రూపాయలు ప్రతిపాదించినము.

45. తెలంగాణ నూతన రాష్ట్రంగా అవతరించిన తరువాత కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి చాలా మంది పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్న విషయాన్ని సభకు తెలియజేయడం మాకెంతో సంతోషంగా ఉంది. గౌరవ ముఖ్యమంత్రి గారు కొద్ది కాలం క్రిందటనే మహబూబ్‌నగర్ జిల్లాలో 970 కోట్ల రూపాయలతో ప్రోక్టర్ అండ్ గాంబల బహుళజాతి సంస్థ కర్మాగారాన్ని ప్రారంభించారు మరియు 450 కోట్ల రూపాయలతో "జాన్సన్ అండ్ జాన్సన్" అను బహుళజాతి సంస్థ కర్మాగారమునకు శంఖుస్థాపన కూడా చేశారు. టాటా ఏరోస్పేస్ సంస్థలో "డోర్నియర్" విమానాల కేబిన్ మరియు లెక్కల నిర్మాణ సంస్థను ఏర్పాటు చేయడానికి తగు భూమిని కేటాయించడం జరిగింది. అదే విధంగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ వారు మార్స్ కక్ష్యలోకి ప్రవేశపెట్టిన అంతరిక్ష నౌకకు అవసరమైనౌటు వంటి బూస్టర్ రాకెట్‌ను హైదరాబాదుకు చెందిన ఒక సంస్థ వారు తయారు చేసారనే విషయం మీ అందరికీ సగర్వంగా తెలియజేస్తున్నాను.

46. సమైక్య రాష్ట్రంలో పరిశ్రమలకు ఇన్‌సెంటివ్ రూపంలో చెల్లించాల్సిన 638 కోట్ల రూపాయల బకాయిలను చెల్లించడానికి నిర్ణయించావము. ఈ బడ్జెట్‌లోనే అందుకు నిధులు ప్రతిపాదించినము. పరిశ్రమలకు విద్యుత్ సబ్సిడీలు అందించడం కోసం 100 కోట్ల రూపాయలు ప్రతిపాదించినము. హైదరాబాద్‌లో

ఏర్పాటు చేసే ఐటి ఐ ఆర్ ప్రాజెక్టు కోసం 90 కోట్ల రూపాయలు ప్రతిపాదించినము. సింగరేణి కాలరీస్‌ను అభివృద్ధి చేయడం కోసం కూడా చర్యలు తీసుకుంటున్నాము. సింగరేణి ద్వారా విదేశాలలో ఉన్న బొగ్గు గనులను నిర్వహించే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నాము. మెదక్ జిల్లాలో 12,365 ఎకరాల్లో నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ ఏర్పాటు చేస్తున్నాము. ఇందులో 40 వేల కోట్ల రూపాయల వరకు పెట్టుబడులు వస్తాయి. దాదాపు 3 లక్షల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు, నాలుగున్నర లక్షల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

47. అభివృద్ధిలో వికేంద్రీకరణ జరగాలన్నది మా ప్రభుత్వ విధానం. హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు ప్రభుత్వం తీసుకుంటున్నది. వరంగల్‌లో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నాము. హైదరాబాద్‌లో రీసర్చ్ అండ్ ఇన్నొవేషన్ సర్కిల్‌ను ఏర్పాటు చేస్తున్నాము. పరిశ్రమలు, విద్యా సంస్థలు, పరిశోధన సంస్థల మధ్య సమన్వయం, పరస్పర సహకారం పెంపొందించు కోవడానికి ఇది దోహదపడుతుంది.

48. ఎస్సీలలోని పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకొంటుంది. ఇందుకోసం 97.51 కోట్ల రూపాయలను ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించినము.

*మరమగ్గాల కార్మికులు :*

49. దుర్భర పరిస్థితుల్లో ఉన్న పవర్‌లూమ్ కార్మికులను ఆదుకోవాలని ప్రభుత్వం నిశ్చయించింది. పేద కార్మికులకు ఉన్న రుణాలను లక్ష రూపాయల వరకు మాఫీచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

*పట్టణాభివృద్ధి :*

50. హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయ ఖ్యాతి ఉన్నది. ఇక్కడున్న మెట్రో పాలిటన్ కల్చర్, సమతుల వాతావరణ పరిస్థితులు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులను పరిశ్రమలు స్థాపించడానికి ఆకర్షిస్తున్నాయి. అయితే నగరంలో పెరుగుతున్న జనాభా వల్ల రద్దీ కూడా ఎక్కువవుతున్నది. ఈ సందర్భంలో హైదరాబాద్ నగరంలో మౌళిక వసతులు పెంచడాన్ని అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా ప్రభుత్వం గుర్తించింది. హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దడం కోసం కృషి చేస్తున్నాము. సేఫ్, స్మార్ట్ అండ్ స్లమ్‌లెస్ సిటీగా హైదరాబాద్‌ను మార్చడానికి చలా ప్రణాళికలు సిద్ధం చేశాము.

51. హైదరాబాద్ నగరాన్ని సురక్షితమైన ప్రాంతంగా, నేర రహిత నగరంగా తీర్చిదిద్దడానికి అవసరమైన చర్యలన్నీ తీసుకొంటున్న విషయం సభ్యులందరికి తెలుసు. హైదరాబాద్ నగరంలో పోలీసులకు 350 కోట్ల రూపాయల వ్యయంతో జిపి ఎస్, కంప్యూటర్ లాంటి అత్యాధునిక వసతులతో కూడిన వాహనాలను సమకూర్చాము. సంఘటనా స్థలానికి 10 నిమిషాలలోనే పోలీసులు చేరుకునే విధంగా ఏర్పాట్లు చేశాము. నగర వ్యాప్తంగా సిసి కెమెరాలను కూడా ఏర్పాటు చేస్తాము. ఇందుకోసం హైదరాబా పోలీస్ కమీషనరేట్‌కు 44.59 కోట్ల రూపాయలను, సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్‌కు 25 కోట్ల రూపాయలు ప్రతిపాదించినము. నగరంలోని పోలీసు స్టేషన్లను ఆధునికీకరించడానికి ఈబడ్జెట్‌లో 20 కోట్ల రూపాయలను ప్రతిపాదించినము. ప్రజలకు ఇబ్బంది కలిగించని విధంగా ట్రాఫిక్ నిర్వహించడం కోసం, వ్యవస్థీకృత నేరాలను అరికట్టడం కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసులకు అందించడం కోసం 21.41 కోట్ల రూపాయలను ప్రతిపాదించినము. సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలో బ్యారక్‌లు, క్యాంపింగ్ సెంటర్లు నిర్మించడానికి 45 కోట్ల రూపాయలు ప్రతిపాదించినము.

52. హైదరాబాద్‌లోని జి. హెచ్. ఎం.సి. మెట్రో రైల్వే, మెట్రో పాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు లాంటి సంస్థలకు ఆర్థిక సహకారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటి ద్వారా నగర ప్రజలకు రకాల సేవలు అందుతున్నందున ఆ కార్యక్రమాలను మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం చేయూతనిస్తుంది. జి. హెచ్. ఎం. సి. ఆధ్వర్యంలో జరిగే మురికి వాడలు లేని నగరం కార్యక్రమానికి 250 కోట్లు ప్రతిపాదించినాము. హైదరాబాద్ మెట్రో రైల్వేకి 416.67 కోట్లు ప్రతిపాదించినాము. హెచ్. ఎం. డబ్ల్యు. ఎస్. ఎస్.బి.కి హైదరాబాద్ పట్టణంలోని మురికివాడల్లో మంచినీటి సరఫరా మెరుగుదల, కృష్ణా, గోదావరి మంచినీటి పథకాల అమలు మరియు మురుగు నీటి పారుదల వ్యవస్థ కోసం మెరసి 581 కోట్లు ప్రతిపాదించినాము.

53. ఇతర పురపాలక సంఘాలలో పౌరులకు సౌకర్యాలు కల్పించడానికి కూడా మా ప్రభుత్వం అంతే కృత నిశ్చయంతో వుంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నడిచే రాష్ట్ర ప్రణాళికా పథకాల క్రింద చిన్న మరియు మధ్యతరహా పట్టణాలకోసం మా ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో 374.73 కోట్ల రూపాయలు ప్రదిపాదించడం జరిగింది. విదేశీ సహాయ నిధులతో నడిచే పురపాలక అభివృద్ధి పథకం కింద

పురపాలక సంఘ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా మరియు మురుగునీటి పారుదల సౌకర్యాలకోసం ఈ బడ్జెట్‌లో 200 కోట్ల రూపాయలు ప్రతిపాదించడం జరిగింది. దీనికి తోడు 150 కోట్ల రూపాయలు పురపాలక సంఘాల సహాయంకోసం రాష్ట్రఆర్థిక సంఘ నిధుల నుంచి ప్రతిపాదించడం కూడా జరిగింది.

*రహదారులు :*

54. అత్యుత్తమమైన రహదారులు ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి తోడ్పడతాయి. రహదారులను అభివృద్ధి చేయడాన్ని అత్యంత ప్రాధాన్యత కల అంశంగా ప్రభుత్వం చేపడుతున్నది. తెలంగాణలోని హైవేలు, ప్రధాన రహదారులు, పంచాయతీరాజ్ పరిధిలోని రహదారులన్నింటినీ అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నది. వచ్చే రెండేళ్లలో అన్ని రహదారులను దాదాపు 10 వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇందు కోసం 4 వేల కోట్ల రూపాయలను ప్రతిపాదించినాము. రహదారుల అభివృద్ధి కోసం తీసుకోవలసిన చర్యలపై చర్చించేందుకు ఉప ముఖ్యమంత్రి డా.టి. రాజయ్యగారి నేతృత్వంలో కాబినెట్ సబ్ కమిటీ కూడా పనిచేస్తుంది. మండల కేంద్రం నుండి జిల్లా కేంద్రాలకు డబుల్ రోడ్లను నిర్మించడానికి 400 కోట్ల రూపాయలను ప్రతిపాదించినాము. తెలంగాణ ఆర్.టి.సి.ని బలోపేతం చేయడానికి ఇప్పటికే 250 కోట్ల రూపాయలు విడుదల చేశాము. మొత్తం 400 కోట్ల రూపాయలు ఆర్.టి.సి. కోసం ఖర్చు పెడతాం. త్వరలోనే దాదాపు 1000 కొత్త బస్సులను ఆర్.టి.సి. కి సమకూరుస్తున్నాము.

*విద్యుత్తు :*

55. మనందరికీ తెలుసు మానవ జీవితాన్ని ఇప్పుడు కరెంట్ నడిపిస్తున్నది. కరెంటు లేకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించడమే కష్టం . అవసరాలు పెరిగిపోవడంతో కరెంటు డిమాండ్ కూడా పెరిగింది. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కువ మంది రైతులు, ఎక్కువ సంఖ్యలో ఉన్న పారిశ్రామిక సంస్థలు, సేవా రంగంలో ఉన్న ఉద్యోగులు అనునిత్యం కరెంట్ పైననే ఆధారపడి ఉన్నారు. సమైక్య ఆంధ్రప్రదేశ్ పాలకులు ఉద్దేశ్యపూర్వకంగా తెలంగాణ ప్రాంతం పట్ల వివక్ష చూపడం వల్ల ఇప్పుడు విద్యుత్ కొరత ఏర్పడింది. తెలంగాణలో అపార బొగ్గు నిక్షేపాలు ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వాలు ఇక్కడ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు పెట్టలేదు. దీనివల్ల ఇప్పుడు మనకు కావలసినంత విద్యుత్ అందుబాటులో లేకుండా పోయింది. తెలంగాణలోని పరిశ్రమలపైన, వ్యవసాయంపైనా ఈ కొరత చాలా ప్రభావం చూపిస్తున్నది. విద్యుత్ సంక్షోభం నుంచి గట్టెక్కడానికి తెలంగాణ ప్రభుత్వం సకల ప్రయత్నాలు చేస్తున్నది. వచ్చే ఐదేళ్లలో 20 వేల మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాము. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో గౌరవ ముఖ్యమంత్రిగారు మొన్ననే విద్యుత్ కొనుగోలు ఒప్పందం కూడా కుదుర్చుకుని వచ్చారు. ఎన్.టి.పి.సి. ద్వారా రామగుండంలో 4 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంటును ఏర్పాటు చేస్తున్నాము. జెన్‌కో ఆధ్వర్యంలో 6 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ప్లాంట్లును నిర్మిస్తున్నాము. ఇందుకోసం బి. హెచ్. ఇ. ఎల్. తో ఎం.ఓ.యు కూడా చేసుకున్నాము. ఇంకా సోలార్ విద్యుత్ ఉత్పత్తికి టెండర్లు కూడా నిర్వహించాము. ఈ ప్రయత్నాలన్నీ ఫలించే వరకు కొంత సమయం పడుతుంది. ఒకటి రెండేళ్లలో పరిస్థితి కొంత మెరుగుపుతుంది. మూడేళ్ల తరువాత మన అవసరాలకు తగినంత విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో అందరికీ 24 గంటల విద్యుత్ అందించడం మా ప్రభుత్వ లక్ష్యం. తెలంగాణ రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతాము. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులను ఆదుకోవడానికి శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో జల విద్యుత్ ఉత్పత్తి చేయడంతో పాటు పవర్ ఎక్చేంజ్‌లో కూడా పెద్ద ఎత్తున కరెంట్ కొనుగోలు చేశాము. జల విద్యుత్, థర్మల్ విద్యుత్‌తో పాటు సోలార్ విద్యుత్‌ను కూడా అందుబాటులోకి తేవడానికి కార్యచరణ తయారుచేశాము. రాష్ట్రంలో రైతులకు సోలార్ పంపుసెట్లను అందించడం కోసం ప్రయత్నాలు చేస్తున్నాము. ఇందుకోసం 200 కోట్ల రూపాయలను ప్రతిపాదించినము. రూఫ్ టాప్ సోలార్ పవర్ ఉత్పత్తి కోసం 40 కోట్ల రూపాయలు ప్రతిపాదించినాము. రాష్ట్ర ప్రణాళికలో భాగంగా టి. ఎస్ జెన్.కో లో 1000 కోట్ల రూపాయల పెట్టుబడి పెడుతున్నాము. నాన్ ప్లాన్ కింద విద్యుత్ రంగానికి 3241.90 కోట్ల రూపాయలను ప్రతిపాదించినము. ఇందులో మూడువేల కోట్ల రూపాయల విద్యుత్ సబ్సిడీలు కూడా భాగం.

*అడవులు, పర్యావరణము :*

56. తెలంగాణలో పచ్చదనాన్ని పెంచేందుకు తెలంగాణకు హరిత హారం అనే కార్యక్రమాన్ని చేపడుతున్నాము. తెలంగాణ వ్యాప్తంగా వచ్చే మూడు నాలుగేళ్లలో 230 కోట్ల మొక్కలను నాటి చెట్లను పెంచాలని నిర్ణయం తీసుకున్నాము. అంతరించిన అడవుల శాతాన్ని పెంచడం, అడవులను రక్షించడం, సామాజిక వనాలను పెంచడం ఈ పథకం లక్ష్యం. ప్రతి నియోజకవర్గంలో 40 లక్షల మొక్కలు పెంచాలని నిర్ణయించుకున్నాము. వచ్చే ఏడాది జూలై మొదటి వారంలో ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుంది. అప్పుడు

మొక్కలు పెంచడానికి వీలుగా ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 3600 నర్సరీలు ఏర్పాటు చేశాము. ఈ పథకం కింద 300 కోట్ల రూపాయలతో కార్పస్ ఫండ్‌ను ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించినము. కంపా, నరేగా కార్యక్రమాలతో హరిత హారం కార్యక్రమాన్ని అనుసంధానం చేస్తాము.

57. తెలంగాణలో ఫారెస్టు కాలేజ్ ఏర్పాటుకు 10 కోట్ల రూపాయలు ప్రతిపాదించినము.

*సాంస్కృతిక, పర్యాటక మరియు క్రీడా రంగాలు:*

58. తెలంగాణ ఉద్యమానికి బలమైన సాంస్కృతిక కోణం ఉంది. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని పునరుద్దరించడానికి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఓ సువర్ణావకాశాన్ని కల్పించింది. ఈ అవకాశాన్ని మనం సద్వినియోగం చేసుకోవాల్సి వుంది. అందుకోసమే బతుకమ్మ, బోనాలు పండుగలను స్టేట్ ఫెస్టివల్స్‌గా ప్రకటించాము. తెలంగాణ ప్రజల బతుకుతో, మనోభావాలతో ముడిపడి ఉన్న బతుకమ్మ పండుగను నయనానందకరంగా నిర్వహించాము. తెలంగాణ సంస్కృతిని కాపాడేందుకు, మన సాంస్కృతిక విశిష్టతను చాటుకునేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటుంది. హైదరాబాద్‌లో తెలంగాణ కళాభవన్, వరంగల్‌లో కాళోజి సాంస్కృతిక కేంద్రం ఏర్పాటు చేస్తున్నాము. వీటి కోసం ఈ బడ్జెట్‌లో 15 కోట్ల రూపాయలను ప్రతిపాదించినము. ఇందిరాపార్క్‌లో 11 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ కళాభావన్ నిర్మిస్తాం.

59. తెలంగాణ ఉద్యమాన్ని క్రింద స్థాయి వరకు తీసుకుపోవడంలో కళాకారులు కీలకమ్మైన పాత్ర పోషించారు. ఈ కళాకారుల సేవలను గుర్తిస్తూ తెలంగాణ రాష్ట్ర పునర్‌నిర్మాణంలో కూడా వాడుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కళాకారుల సహాకారాన్ని తీసుకుంటాము. ఇందుకోసం తెలంగాణ సాంస్కృతిక సారధి అనే పథకాన్ని తీసుకువస్తున్నాం. ఇందుకోసం 11 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నం.

60. టి.టి.డి తరహాలో యాదగిరిగుట్టను అభివృద్ధి చేయాలని నిర్ణయించాము. మా ముఖ్యమంత్రి కేసీ ఆర్‌గారు స్వయంగా యాదగిరిగుట్టకు వెళ్లి అక్కడ చేయాల్సిన పనులను సమీక్షించిన సంగతి గౌరవ సభ్యులకు తెలుసు. దాదాపు 400 ఎకరాల్లో నృసింహ అభయారణ్యం పేరుతో పార్కులను అభివృద్ధి చేస్తాము. 1600 ఎకరాల్లో కళ్యాణ మంటపాలు, ధ్యాన మందిరాలు, వేద పాఠశాల, కాటేజిలు ఏర్పాటు చేయాలని నిర్ణయించాము. గుడి గోపురాన్ని స్వర్ణ గోపురంగా మారుస్తాము. ఈ ప్రదేశాన్ని సమగ్రంగా అభివృద్ధి పరచడానికి ఈ బడ్జెట్‌లో 100 కోట్ల రూపాయలు ప్రతిపాదించినము.

61. గోదావరి పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఈ బడ్జెట్‌లో 100 కోట్ల రూపాయలను ప్రతిపాదించినము.

62. తెలంగాణలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ఈ బడ్జెట్‌లో 60 కోట్ల రూపాయలను ప్రతిపాదించినము.

63. క్రీడలను ప్రోత్సహించడానికి, యువతకు శిక్షణా కార్యక్రమాలు ఇవ్వడానికి ప్రాధాన్యత ఇస్తాము. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ఏ విధంగా ప్రోత్సహిస్తున్నదో మీరంతా చూస్తూనే ఉన్నారు. రాష్ట్రంలో స్టేడియంల నిర్మాణానికి, క్రీడా వసతులను మెరుగుపరచడం కోసం ఈ బడ్జెట్‌లో 90 కోట్ల రూపాయలను ప్రతిపాదించినము.

*శాసనసభ నియోజకవర్గ అభివృద్ధి పథకం :*

64. ఈపథకంలో భాగంగా నియోజకవర్గం ఒక్కింటికి ఇచ్చే నిధిని కోటి రూపాయల నుండి కోటిన్నర రూపాయల వరకు పెంచుతూ అవసరమైన 234 కోట్ల రూపాయలు ప్రతిపాదించినము.

*పరిపాలన :*

65. మనకు సంక్రమించిన ప్రభుత్వ పరిపాలన విధానం అస్తవ్యస్తంగా ఉంది. నిబంధనలు కూడా అడ్డగోలుగా ఉండి ప్రభుత్వ కార్యక్రమాలు వేగంగా ప్రజలకు చేరుకోవడానికి ప్రతిబంధకంగా మారుతున్నాయి. ఇందులో మార్పులు రావలసిన అవసరం ఉంది. ప్రభుత్వ పాలన సజావుగా సాగాలి. అందుకే ప్రస్తుతం ఉన్న బిజినెస్ రూల్స్‌ను (వ్యవహార నిబంధనలను) మార్చాలని నిర్ణయించుకున్నాము. ప్రజలకు మరింత జవాబుదారిగా ఉండేందుకు నిబంధనలు కూడా మార్చాలని నిర్ణయించాము. రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే సమగ్రమైన ఆర్థిక నిర్వహణ విధానాన్ని తీసుకువస్తుంది. అన్ని ఆర్థిక వ్యవహారాలు ఆన్‌లైన్‌లో జరిగే విధంగా, జాప్యాన్ని నివారించే విధంగా, పారదర్శకంగా ఉండాలనేది మా సంకల్పం.

### ఉద్యోగుల సంక్షేమం :

66. తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగులు చాలా కీలకమైన పాత్ర పోషించారు. బంగారు తెలంగాణ నిర్మాణం వారి అంకితభావం తోనే సాధ్యం. ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం కావాలంటే ఉద్యోగుల సహకారం ఉండాలి. అందుకే మా ప్రభుత్వం ఉద్యోగుల పాత్రను, ప్రాముఖ్యతను గుర్తిస్తున్నది. రాష్ట్రంలో ఎంప్లాయి ఫ్రెండ్లీ ప్రభుత్వం ఉన్నది. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఇంక్రిమెంట్ ఉద్యోగులకు అందించింది. నిత్యం బదిలీలు అంటూ వేధించవద్దనే విధాన నిర్ణయం తీసుకున్నది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానమైన వేతనాలు ఇవ్వాలనే ఆలోచనతో కమిటీ వేసింది. ప్రభుత్వ ఉద్యోగులందరికి ఆర్థిక పరిమితి లేకుండా వైద్యం అందిస్తాము. ఇందుకోసం హెల్త్‌కార్డులు కూడా ఇచ్చినం, దీపావళి కానుకగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాము. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసేందుకు విధాన నిర్ణయం తీసుకున్నాము.

### గృహ నిర్మాణం :

67. గృహ నిర్మాణ విషయానికి వస్తే, మీ అందరికి బాగా తెలుసు. పేదల ఇండ్ల నిర్మాణ పథకాలంటేనే అవినీతి, అక్రమాలకు మరోపేరుగా మారాయి. పేదలకు గూడు అందించాల్సిన పథకాలు పెద్దల అక్రమార్జనకు ఉపయోగపడ్డాయి. వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి కొద్దిపాటి ఇండ్లు నిర్మించినా అవి కూడా అసౌకర్యంగానే ఉంటున్నాయి. మా ముఖ్యమంత్రిగారు, ఒకే గదిలో సంసారం చేసే కుటుంబాలు ఎంతగోస పడతాయో, ఆత్మ గౌరవం ఎలా మంట కలుస్తుందో చాలాసార్లు చెప్పారు. అందుకే మేము బలహీన వర్గాలు ఆత్మ గౌరవంగా బతికేందుకు రెండు పడక గదులు, హాలు, వంటగది, మరుగుదొడ్డి ఉండే విధంగా ఇండ్ల నిర్మాణం చేయాలని నిర్ణయించుకున్నాయి. ఒక్కో ఇంటికి మూడున్నర లక్షల వరకు కేటాయించాము. వివిధ పథకాల అమలుకోసం 1000 కోట్ల రూపాయల ఖర్చు ప్రతిపాదించినము.

68. బతుకు భారమై, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కరువై తెలంగాణ బిడ్డలు చాలామంది బతకడానికి పొట్ట చేతబట్టుకుని గల్ఫ్ దేశాలకు వలస పోయారు. ఇందుకోసం వారు పెద్ద మొత్తంలో అప్పులుకూడా చేశారు. అయితే గల్ఫ్‌దేశంలో కూడా వారికి సరైన ఉద్యోగావకాశాలు రాకపోవడంతో వారంతా మళ్లీ ఇక్కడికి వస్తున్నారు. అయితే, పాత అప్పులు తీర్చలేక నరకం అనుభవిస్తున్నారు. దీంతో పాటు అనేక రకాల ఇతర సమస్యలు కూడా వారికున్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని గల్ఫ్ నుండి తిరిగి వచ్చిన వారికోసం ఓ ప్రత్యేక ప్యాకేజి ఇచ్చే విషయాన్ని ప్రభుత్వం ఆలోచిస్తున్నది.

69. బతుకు తెరువు కోసం తెలంగాణలో చాలా మంది యువకులు ఆటో డ్రైవర్లుగా మారారు. వారికి అండగా నిలవాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఆటోలపై రవాణ పన్నును రద్దు చేసింది. 76.26 కోట్ల రూపాయల పాత పన్ను బకాయిలు కూడా మాఫీ చేసింది. రైతులు ఉపయోగించే ట్రాక్టర్లు మరియు ట్రాక్టరు ట్రాలీలపై కూడా రవాణ పన్నును ప్రభుత్వం రద్దు చేసింది. దీనికోసం ఈ ఆర్థిక సంవత్సరం నుంచి 56.87 కోట్ల రూపాయల పన్నును మాఫీ చేసేందుకు ప్రతిపాదించినం.

70. తెలంగాణ ఉద్యమంలో న్యాయవాదుల పాత్ర ఉత్తేజకరమైంది. సమాజానికి వారు అందిస్తున్న ఎనలేని సేవలు గుర్తించి వారి సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో 100 కోట్ల రూపాయలు ప్రతిపాదించినము.

71. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు చురుకైన పాత్ర నిర్వహించారు. తెలంగాణ పునర్‌నిర్మాణంలో కూడా తెలంగాణ జర్నలిస్టులు కృషిసల్పుతున్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇప్పటి దాకా జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను ఏ రాజకీయ పార్టీ కూడా మానిఫెస్టోలో పెట్టలేదు. మా పార్టీ మానిఫెస్టోలో పెట్టిన విధంగానే జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నది. జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు అందిస్తాము. హైదరాబాద్‌లో అన్ని హంగులతో జర్నలిస్టు భవన్ నిర్మిస్తాము. వీటికై 10 కోట్ల రూపాయలు ప్రతిపాదించినము.

### బడ్జెటు అంచనాలు :

72. 2014-15 ఆర్థిక సంవత్సరంలోని 10 నెలల కోసం ప్రభుత్వం మొత్తం రూ. 1,00,637.96 కోట్ల వ్యయాన్ని ప్రతిదిస్తున్నది. ఇందులో రూ. 51,989.49 కోట్ల ప్రణాళికేతర వ్యయాన్ని, రూ. 48,648.47 కోట్ల ప్రణాళిక వ్యయాన్ని అంచనా వేయడమయింది. అంచనా వేసిన రెవిన్యూ మిగులు రూ. 301.02 కోట్లు. రూ. 17,398.72 కోట్ల ఆర్థిక లోటును అంచనా వేయడమయింది. జి. ఎస్.డి.పి. శాతం ప్రకారం అంచనా వేసిన ఆర్థిక లోటు 4.79 శాతం. కేంద్ర ప్రభుత్వ నిధులు ఆశించిన మేరకు వస్తాయని మరియు ప్రతిపాదించిన అదనపు నిధులు లభ్యమౌతాయనే నమ్మకంతో ఈ అంచనాలను వేసినం.

73. సాధారణంగా బడ్జెట్ అంటే అంకెల కసరత్తులాగానే ఉంటుంది. జమ ఖర్చుల పద్దులాగానే కనిపిస్తుంది. కాని ఇప్పుడు మేము ప్రవేశపెడుతున్న బడ్జెట్ అలా కాదు ఇది తెలంగాణ ప్రజల కలలు సాకారంచేసే సజీవ ఆర్థిక ప్రణాళిక. తెలంగాణ ప్రజల మేలు

కోసం ప్రజలే రూపొందించిన కరదీపిక, భావితరాల బంగారు భవిత కోసం నిర్దేశించుకున్న మార్గాలను ఇక్కడ మేము అవిష్కరిస్తున్నాము. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం ప్రజల నమ్మకాన్ని పెంచింది. వారి భవిష్యత్తుకు భరోసా కలిగించింది. బంగారు తెలంగాణ అనే స్వప్నం సాకారం అయ్యేందుకు చేసే సుదీర్ఘ ప్రయాణంలో ఇది మొదటి అడుగుగా మేము భావిస్తున్నాము. ప్రజల విస్తృత భాగస్వామ్యంతో గమ్యాన్ని చేరుకుంటామనే అచంచల విశ్వాసం మాకు ఉన్నది. లక్ష్యం సాధించే వరకు మేము వెనక్కి వేసే ప్రశ్నేలేదు. నేను ఈబడ్జెట్‌ను ఈ సభ ఆమోదంకోసం ప్రవేశపెడుతున్నాను.

//జై తెలంగాణ//

(గౌరవ ప్రతిపక్ష సభ్యులు సర్వశ్రీ పొంగులేటి సుధాకర్, ఎం. రంగారెడ్డి, ఎం. ఎస్. ప్రభాకర్ రావు, మహమ్మద్ ఆలీ షబ్బీర్, టి. సంతోష్‌కుమార్ మరియు తెలుగుదేశం గౌరవ సభ్యులు అరికెల నర్సారెడ్డి, పోట్ల నాగేశ్వరరావు తదితరులు నల్లకండువాలు ధరించి తమ, తమ స్థానాలలో లేచి నిలబడి "చీకటి నుండి తెలంగాణాను కాపాడండి", " ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం–చీకటి రాజ్యం, కోతల రాజ్యం", "విద్యార్థుల ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలి", "రైతు ఆత్మహత్యలను ఖండించాలి", "ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతాంగాన్ని వెంటనే కాపాడాలి", "ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు పరచాలి", "విద్యార్థులని, ఉద్యోగస్తులని కాపాడాలి" అంటూ నినాదాలు చేయసాగారు. కొద్ది సేపు తరువాత పోడియం వద్దకు వచ్చి అదే నినాదాలు పదే, పదే చేయసాగారు. గౌరవ ఛైర్మన్ సూచన మేరకు సభ్యులు తమ, తమ సీట్లకు వెళ్లి ఆశీనులయ్యారు.)

మిస్టర్ ఛైర్మన్ : మంత్రిగారు, ఒక్క నిమిషం.....

శ్రీ డి. శ్రీనివాస్: (శాసనసభ నియోజకవర్గం) అధ్యక్షా, బడ్జెట్ ప్రసంగాన్ని ఇబ్బంది పెట్టాలనేది నా ఉద్దేశ్యం కాదు. రాష్ట్రంలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా ఈ రోజు వివిధ పార్టీల వారు సభలో ప్రదర్శిస్తున్న ప్లకార్డులను చూస్తున్నారు. ఎప్పుడో సెప్టెంబరులో ప్రవేశపెట్టాల్సిన బడ్జెట్ మీద ఆర్డినెన్స్ ద్వారా మీరు ఎక్స్‌టెన్షన్ తీసుకొని ఈ రోజు ప్రెజెంట్ చేస్తున్నారు. ఇంత ఆలస్యం అయినప్పటికీ కూడా మేము సహకరించాలనే ఉద్దేశ్యంతో ఉన్నాం. విద్యుత్తువల్ల రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు, రైతులు పడుతున్న ఇబ్బందులు, ఒకవైపు ఫీజు రీ ఇంబర్స్‌మెంట్‌పైన విద్యార్థుల ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో ఎక్కడా కూడా శాంతియుత వాతావరణం లేనటువంటి ఈ పరిస్థితుల్లో బడ్జెట్‌ను పెట్టాల్సిందే, పాస్ చేసుకోవాల్సిందే. అదే విధంగా fag end of the time కు వచ్చేశాం. నవంబరు 30 లోపల బడ్జెట్ పాస్ చేసుకోవాల్సిందే. ప్రభుత్వం యొక్క ఆత్రుతను అర్థం చేసుకున్నాం. కానీ, ఇంత ఆలస్యంగా పెట్టాల్సిన అవసరం లేకుండే. వీటన్నింటినీ వదిలివేసి, కనీసం మొదటి రోజే బడ్జెట్ ప్రెజెంటేషన్ అనే కార్యక్రమాన్ని పెట్టుకున్నప్పుడు ఉన్న పరిస్థితులు దృష్ట్యా, Leader of the Houseగాని, Revenue Minister గాని, Hon'ble Chief Minister గానీ ఎవరో ఒకరు ఈ రోజు ఉన్నటువంటి పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం చింతిస్తున్నది, ప్రభుత్వం తరఫున ఫలానా స్టెప్ తీసుకుంటున్నామనే ఒక అవుట్‌లైన్‌లో ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధిని కనీసం ఒక స్టేట్‌మెంట్ ద్వారా ప్రకటించి, బడ్జెట్ ప్రసంగానికి సహకరించాలని చెప్పే కనీస గౌరవం లేకుండా మా ఇష్టం వచ్చినట్టు మేము చేసుకుంటాం అనే విధంగా ఉన్నది. మీరు ఎవరు అడిగేది లేదనేది పద్ధతికాదు. దానికి కొన్ని పద్ధతులుంటాయి.

(గౌరవ ఉప ముఖ్యమంత్రి బడ్జెట్ ప్రసంగం కొనసాగింపు)

శ్రీ డి. శ్రీనివాస్ (మైకు లేకుండా): అధ్యక్షా మా సహకారం అవసరం లేదా?

(గౌరవ ఉప ముఖ్యమంత్రి బడ్జెట్ ప్రసంగం కొనసాగింపు)

శ్రీ అరికెల నర్సారెడ్డి (మైకు లేకుండా): (స్థానికసంస్థలు) అధ్యక్షా, ప్రతిపక్షాలకు అవకాశం ఇచ్చాక బడ్జెట్ ప్రసంగం చేయమనండి.

మిస్టర్ ఛైర్మన్ : మంత్రిగారు ... ప్రతిపక్షాల వారికి మైకు ఇచ్చాను. ఒక్క నిమిషం ఆగండి.

శ్రీ డి. శ్రీనివాస్: అధ్యక్షా, మేము ఏమి చెబుతున్నామనే విషయాలపై మా సూచన విని, మీరు బడ్జెట్ ప్రెజంట్ చేసుకోండి.

మిస్టర్ ఛైర్మన్: సీనియర్ సభ్యులు మైకు ఇచ్చినప్పుడు మైకు వాడుకోవాలి.

శ్రీ పాతూరి సుధాకర రెడ్డి (మైకు లేకుండా) : (మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ మరియు కరీంనగర్) కాంగ్రెస్ సభ్యులను ఉద్దేశించి – బడ్జెట్‌లో ఏముందో చెప్పకుండానే మీరు ఎలా మాట్లాడుతారండి. మీరంతా అనుభవజ్ఞులు.

శ్రీ అరికెల నర్సారెడ్డి (మైకు లేకుండా): బడ్జెట్‌పై మాట్లాడడం లేదు. ఈ రాష్ట్రంలో జరుగుతున్నటువంటి రైతుల ఆత్మహత్యల మీద ప్రభుత్వం స్టేట్‌మెంట్ ఇవ్వాలని డిమాండు చేస్తున్నాము. స్టేట్‌మెంట్ ఇచ్చిన తరువాత బడ్జెట్ పెట్టండి. మేము సహకరిస్తాం.

మిస్టర్ ఛైర్మన్: మంత్రిగారూ, ఒక్క నిముషం...

శ్రీ డి. శ్రీనివాస్ (మైకులేకుండా): అధ్యక్షా, మంత్రిగారు ఛెయిర్‌కి గౌరవం ఇవ్వడం లేదు. మంత్రిగారు ఛెయిర్ యొక్క డైరెక్షన్ వినడంలేదు. అంత మంచిది కాదు. మాకూ అనుభవం ఉంది.

శ్రీ ఎం. ఎస్. ప్రభాకర్ రావు (మైకు లేకుండా): (స్థానికసంస్థలు) అధ్యక్షా, మీరు చెప్పినా కూడా మంత్రిగారు ప్రసంగాన్ని ఆపడంలేదు. ఇది ఛైయిర్‌కి, హౌజ్‌కి అవమానం.

మిస్టర్ ఛైర్మన్: మైకు అందరికీ ఇస్తాను, ఒక్క నిమిషం అందరూ కూర్చోండి.

(గౌరవ ఉప ముఖ్యమంత్రి బడ్జెట్ ప్రసంగాన్ని కొనసాగించారు)

శ్రీ డి. శ్రీనివాస్: అధ్యక్షా, మేము బడ్జెట్ ప్రసంగానికి వ్యతిరేకం కాదు. మేము ఒక సూచనను ఇచ్చాం. దాని ప్రకారం ప్రజల యొక్క ఇబ్బందులని, ఒక స్టేట్‌మెంట్ ద్వారా సభ దృష్టికి తెస్తే బాగుండేది. కానీ మంత్రిగారు మా సూచనను వినడానికి కూడా తయారుగా లేరు, ప్రజల యొక్క ఇబ్బందుల మీద పట్టింపు లేదు. ఛెయిర్ నుండి డైరెక్షన్ వస్తే కూడా మంత్రిగారు అర్థం చేసుకొనే పరిస్థితిలోలేరు.

మిస్టర్ ఛైర్మన్: ఏవైనా విషయాలు ఉంటే బి. ఎ.సి.లో మాట్లాడుకుందాం. దయచేసి మీరు సీనియర్ సభ్యులు. బడ్జెట్ ప్రసంగాన్ని ఆపవద్దని రెక్వెస్టు చేస్తున్నాను.

(గౌరవ ఉప ముఖ్యమంత్రి బడ్జెట్ ప్రసంగాన్ని కొనసాగిస్తున్నారు)

(రైతులను ఆదుకోవడానికి రూ. 480.43 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడి బకాయిలను చెల్లించామని ప్రసంగిస్తుంటే ప్రతిపక్ష సభ్యులు శ్రీ పొంగులేటి సుధాకర రెడ్డి మరియు తదితరులు తమ, తమ స్థానాలలో లేచి నిబడి రైతుల ఋణాలను వెంటనే మాఫీ చేయాలని నినాదాలు చేశారు.)

(శ్రీ పొంగులేటి సుధాకర రెడ్డి తదితర కాంగ్రెస్ పార్టీ సభ్యులు పోడియం వద్దకు వచ్చి "అన్న దాతల్ని వెంటనే ఆదుకోవాలి, మాటల గారడి ప్రభుత్వ మొండి వైఖరి నశించాలి, ఇదేమి రాజ్యం, ఇదేమి రాజ్యం – చీకటి రాజ్యం, కోతల రాజ్యం, పోలవరం డిజైన్‌ను వెంటనే మార్చాలి, పోలవరం క్రింద ఉన్నటువంటి ముంపు ప్రాంత ప్రజల్ని వెంటనే ఆదుకోవాలి" అంటూ నినాదాలు చేయసాగారు.

సభ్యులు శ్రీ పొగులేటి సుధాకర రెడ్డి, "ప్రతిపక్ష నాయకుడు అడిగినటువంటి స్టేట్‌మెంట్ కూడా ఇవ్వలేదు, కనీసం ఒక ప్రకటన కూడా చేయలేదు, ఛైయిర్ యొక్క డైరెక్షన్‌ని కూడా పాటించనందుకు మరియు బాధలో ఉన్నటువంటి రైతాంగాన్ని పట్టించుకోనందుకు నిరసన తెలియజేస్తున్నామని" అన్నారు. శ్రీ ఎం. రంగారెడ్డి తదితర కాంగ్రెస్ పార్టీ సభ్యులు బడ్జెట్ ప్రతులను చింపివేశారు)

(ఇంతలో గౌరవ ఉప ముఖ్యమంత్రిగారు బడ్జెట్ ప్రసంగాన్ని ముగించారు.)

మిస్టర్ ఛైర్మన్: శుక్రవారం 7, నవంబరు 2014వ తేదీ ఉదయం 10.00 గం.లకు తిరిగి సమావేశమయ్యేందుకు సభను వాయిదా వేయడమయింది.

(The House, then adjourned at 12.20 p.m. to meet again at 10.00 a.m. on Friday, the 7th November, 2014)

* * *

“Published under Rule 316 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Council and Printed at the Assembly Press, Public Gardens, Hyderabad.”